
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
నల్లగొండ
5
సోమవారం 9 డిసెంబరు 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	185	205
సూర్యాపేట	రూ.125	190	210
నల్లగొండ	రూ.130	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.2 । కనిష్ఠం 21.0



ఇందిరమ్మ రాజ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాను సస్య శ్యామలం చేస్తాం.. జిల్లాలో గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన అన్ని సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యక్రమంలో పూర్తి చేస్తాం.. ఏడాది కాలంలో గత ప్రభుత్వం చేసిన అప్పులు తీర్చుతూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళ్తాం.. అని పేర్కొంటున్న భారీ నీటిపారుదలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ విశేషాలు..

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

ఉమ్మడి జిల్లా సస్యశ్యామలమే లక్ష్యం

- తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టుకు నీరందిస్తాం
- ప్రాధాన్య క్రమంలో ప్రాజెక్టుల పనులు పూర్తిచేస్తాం
- ప్రతీ మండలంలో ప్రపంచ స్థాయి స్కూళ్లు
- ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లా నెంబర్‌వన్
- భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల ఏర్పాటు అనివార్యం. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా మేం తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేలా ప్రాజెక్టులు, పథకాలు రూపొందిస్తున్నాం. ఈ మేరకు కార్యాచరణ అమలు చేస్తున్నాం.

ప్రాధాన్యక్రమంలో ప్రాజెక్టులు

ఉమ్మడి జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గ పెండింగ్ పనులు, అందులో అంతర్భాగమైన పెండ్లిపాకల, నక్కలగండి రిజర్వాయర్ నిర్మాణాల పనులు పూర్తిచేస్తాం. బ్రాహ్మణవెల్లెంల నుంచి మరో ఏడాదిలో పూర్తి ఆయకట్టుకు నీరిచేలా పనులు పూర్తి చేస్తాం. మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లోని 3.50లక్షల ఎకరాలకు నీరిచ్చే డిండి ఎత్తిపోతల పథకాన్ని,దాని పరిధిలోని రిజర్వాయర్లను రానున్న మూడేళ్లలో పూర్తి చేస్తాం.అదే విధంగా సాగర్ ఎడమ కాల్వ మరమ్మతులు, డిస్ట్రిబ్యూటరీలు, మేజర్ల మరమ్మతులు పూర్తిచేస్తాం. పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలు, అసిఫ్‌నహర్, ఇతర అన్ని మూసీ కాల్వలకు ఇటీవలే నిధుల మంజూరు చేశాం. ఈ పనులన్నీ త్వరలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

ఎత్తిపోతల పథకాలన్నీ పనిచేసేలా ప్రణాళిక

ఉమ్మడి జిల్లాలో సాగర్ ఎడమ కాల్వపై హుజూర్‌నగర్, కోదాడ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాలతో పాటు ఇతర జలవనరులపై ఉన్న ఎత్తిపోతల పథకాలన్నీ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు చేపట్టాం. సాంకేతిక సిబ్బందిని క్లస్టర్ వారీగా నియమిస్తున్నాం. మరమ్మతులు ఎప్పటికప్పుడు చేపట్టేలా చర్యలు తీసుకున్నాం. అదే విధంగా మిర్యాలగూడ, దేవరకొండ, సాగర్ నియోజకవర్గాల్లో నిర్మాణంలో ఉన్న అన్ని ఎత్తిపోతల పథకాలను సమీక్షించి వాటి...

- మిగతా 6వ పేజీలో...



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది కాలం ముగిసింది. ఉమ్మడి జిల్లాలోనూ 12 స్థానాలకు 11 చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తుండగా, వీరిలో హుజూర్‌నగర్ నుంచి గెలిచిన నల్లమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి భారీ నీటి పారుదలశాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రిగా, నల్లగొంద నుంచి గెలిచిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రిగా క్యాబినెట్‌లో స్థానం దక్కించుకున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

చేయాల్సినవి ఇంకా ఎన్నో

- కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తి
- ప్రభుత్వంపై ప్రజల ఆశలు

జిల్లాలో ఏకపక్ష విజయాలు నమోదు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజానీకం ఎన్నో ఆశలు పెంచుకుంది. హామీల్లో సింహభాగం అమలు కాకపోవడంతో జనంలో కొంత అసంతృప్తి నెలకొనగా, ప్రభుత్వం బాలారిష్టాలు దాటిందని, రానున్న రోజుల్లో ప్రగతి పరుగులు తీస్తుందని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు చెబుతున్నారు.

ఏడాదిలో చేసినవి కొన్నే

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొన్ని పనులు చకచకా సాగాయి. ప్రధానంగా జిల్లాకు ప్రతిష్ఠాత్మకమైన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనుల్లో వేగం పెంచి, శనివారం ఈ ప్లాంట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి జాతికి అంకితం చేశారు. మొత్తం ఐదు యూనిట్లకు ఒక యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి మొదలవగా, మిగిలిన నాలుగింటిని కూడా రానున్న మే నెలాఖరుకు పూర్తి చేసేలా సీఎం ఆదేశాలు జారీచేశారు. అదే విధంగా నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి వద్ద నిర్మాణమైన లక్ష ఎకరాలకు నీరిచ్చే బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టును సైతం సీఎం లాంఛనంగా ప్రారంభించారు. ఇంకా ఈ ప్రాజెక్ట్ కింద కాల్వల నిర్మాణాలు, అందుకు అవసరమైన భూసేకరణ చేయాల్సి ఉంది. నల్లగొండలో ఏర్పాటుచేసిన మెడికల్ కళాశాలకు నిర్మించిన నూతన భవనాలను సైతం నల్లగొండ పర్యటనలో సీఎం ప్రారంభించారు.

ఎనిమిది చోట్ల ఏటీసీలు

యువతకి నైపుణ్య విద్యానందించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచే ఉద్దేశ్యంతో చేపట్టిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను (ఏటీసీ) ఉమ్మడి జిల్లాలో ఎనిమిది చోట్ల ఏర్పాటు చేస్తున్నారు. నల్లగొండ, భువనగిరి, హాలియా, డిండి, ఆలేరు, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, నకిరేకల్ లలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు.


ప్రాజెక్టుల పనులు ముమ్మరం

జిల్లాలో గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైనట్టు భావిస్తున్న ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టులు సహా అన్ని ఎత్తిపోతల పథకాలను అత్యంత ప్రాధాన్యంగా రానున్న మూడేళ్లలో పూర్తి చేయాలని జిల్లా మంత్రులు నీటిపారుదలశాఖ అధికారులను...

- మిగతా 6వ పేజీలో...

చేయాల్సిన పనులు

- నల్లగొండ, సూర్యాపేట జిల్లా కేంద్రాల్లో నిరుపయోగంగా ఉన్న ఐటీ హబ్‌లలో కార్యకలాపాలు కొనసాగేలా చూడాల్సి ఉంది.
- విలీన గ్రామాలను కలిపి నల్లగొండ పట్టణాన్ని కార్పొరేషన్‌గా ప్రకటించాల్సి ఉంది.
- యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులైన కుటుంబాలకు ఇంటికి ఒకరి చొప్పున ఉద్యోగాలివ్వాల్సి ఉంది.
- పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పనులను రూ.250కోట్ల వ్యయంతో చేపట్టాలి.
- ఘట్కేసర్-భువనగిరి వరకు ఎంఎంటీఎస్ పనులు పూర్తిచేయాల్సి ఉంది.
- బస్వాపూర్ రిజర్వాయర్ పూర్తిచేయాల్సి ఉంది.
- సూర్యాపేటలో మహిళా పోలీస్‌స్టేషన్ ఏర్పాటుతోపాటు జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తరణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.
- శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాల్వల పరిధిలో చివరి ఆయకట్టుకు నీరివ్వాలని రైతులు కోరుతున్నారు.
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాల్సి ఉంది.
- కోదాడ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకలు చేస్తామని హామీ ఇవ్వగా, రూ.30కోట్ల నిధులతో పనులు ప్రారంభించారు.
- ఈ పనులను వేగంగా పూర్తిచేయాల్సి ఉంది.
- గ్రామాలతో పాటు పెద్ద పట్టణాల మధ్య అనుసంధానానికి డబుల్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ పనులను కూడా వేగంగా పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.
- భువనగిరి-వరంగల్ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.
- సీసీఎంబీ పరిశోధనా కేంద్రానికి నిధులిచ్చి పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



మూసీ కాలుష్యం, ఫ్లోరైడ్ భూతంతో అల్లాడుతున్న నల్లగొండ జిల్లాను బంగారు కొండగా చేసి చూపిస్తా.. ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పూర్తిచేసి ఫ్లోరైడ్ భూముల్లో కృష్ణా జలాల పారించడం నా జీవిత లక్ష్యం.. అప్పటివరకూ విశ్రమించేది లేదు.. నేనెక్కడున్నా నల్లగొండ చుట్టూనే నా ప్రాణం ఉంటుంది.. నల్లగొండ అభివృద్ధి, ఇక్కడి ప్రజల సంక్షేమమే నా ఏకైక లక్ష్యం... అని పేర్కొంటున్న రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ విశేషాలు..

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

నల్లగొండను బంగారు కొండ చేస్తాం

- ఎక్కడున్నా నా ప్రాణం నల్లగొండలోనే
- ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పూర్తి చేయడం నా జీవిత లక్ష్యం
- మూసీ ప్రక్షాళన చేయించి రుణం తీర్చుకుంటాం
- రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

జిల్లాలో ఫ్లోరైడ్ బాధిత 3.50లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చే శ్రీశైలం సొరంగ మార్గాన్ని వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు పట్టుబట్టి మంజూరు చేయించా. ప్రపంచంలోనే 44కిలోమీటర్ల సొరంగ మార్గం ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించాం. 2014లోపే 34కిలోమీటర్ల పని పూర్తయినా, ఆ తర్వాత కేసీఆర్ ప్రభుత్వం నాపై కక్షతో ఈ ప్రాజెక్టును పక్కన పెట్టింది. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించాం. నేను స్వయంగ్ అమెరికా వెళ్లి బేరింగ్ యంత్రం సామగ్రి ఆర్డర్ చేశా. జనవరి నుంచి పనులు ప్రారంభమవుతాయి. ఎవరు అడ్డుపడ్డా ఎస్ఎల్‌బీసీ ఆగదు.

డిండి, బ్రాహ్మణవెల్లెంల కూడా పూర్తిచేస్తాం

జిల్లాలోని మునుగోడు, దేవరకొండ ప్రాంతలకు నీరిచే డిండి ఎత్తిపోతల పథకాల పనులు పూర్తి చేయిస్తాం. శివన్నగూడెం, చర్లగూడెం అన్ని రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తిచేస్తాం. బ్రాహ్మణవెల్లెంల కాల్వలు కూడా పూర్తి చేయించి లక్ష ఎకరాలకు నీరిస్తాం.

నల్లగొండను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

నల్లగొండ జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచడమే లక్ష్యంగా పనిచేస్తాం. ఇప్పటికే మెడికల్ కళాశాల నూతన భవనాల నిర్మాణం పూర్తిచేశాం. నర్సింగ్ కళాశాల కూడా మంజూరైంది. త్వరలో డెంటల్ కళాశాల కూడా తేస్తాం. ప్రతీ మండలానికి ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు చేయిస్తా. తొలి విడతలో ప్రతీ నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేస్తున్నాం. ప్రతీ నియోజకవర్గంలో...

- మిగతా 6వ పేజీలో...

భూసేకరణ నిరూపిస్తే రాజీనామా చేస్తా

- లేదంటే నీ ఎమ్మెల్యే పదవిని వదులుకోవాలి
- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డికి ఎమ్మెల్యే వీరేశం సవాల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టుకు భూసేకరణ చేసినట్లు నిరూపిస్తే తన పదవిని వదులుకుంటానని, లేకపోతే మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి తన ఎమ్మెల్యే పదవిని వదులుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సవాల్ విసిరారు. నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఐదేళ్ల కాలంలో బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టుకు భూసేకరణ ఎంత చేసిందో, కాల్వలకు ఎన్ని నిధులు కేటాయించిందో జగదీష్‌రెడ్డి చెప్పాలని డిమాండ్‌చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో జగదీష్‌రెడ్డి సాధించింది గుండు సున్నా అని ఎద్దేవా చేశారు. బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు విషయంలో గతంలో ట్రయల్ రన్ చేసి రిజర్వాయర్‌లోకి నీరు ఎందుకు నింపలేదన్నారు. కేవలం ఓట్లకోసమే మోటార్లు రన్ చేసినట్లు తెలిపారు. జిల్లా ప్రజలను బీఆర్ఎస్ మోసం చేయడం వల్లే ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజలు పట్టం కట్టారన్నారు.

మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటే నల్లగొండ జిల్లా ప్రజలు వారిని మూసీలో కలిపేస్తారని హెచ్చరించారు. నల్లగొండలో శనివారం జరిగిన ముఖ్యమంత్రి బహిరంగ సభ విజయవంతమైందన్నారు. సమావేశంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పూజర్ల శంభయ్య, నకిరేకల్ మునిసిపల్ ఛైర్‌పర్సన్ చెవుగోని రజితశ్రీనివాస్, పీఏసీఎస్ ఛైర్మన్ నాగులంచ వెంకటేశ్వర్‌రావు, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, నకిరేకంటి యేసుపాదం, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీ ఆలస్యానికి కారకులను వెల్లడిస్తా

- మేము పూర్తి చేసిన పనులకు సీఎంతో ప్రారంభోత్సవాలు
- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం సొరంగ మార్గం ప్రాజెక్టు పనులు ఆలస్యం కావడానికి కారకులు ఎవరో సాక్ష్యాధారాలతో త్వరలో ప్రజల ముందు పెడతామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీకి ద్రోహంచేయడంలో భాగంగా కుట్రపూరితంగా ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా టీబీఎం మిషన్‌ను తీసుకవచ్చారని ఆరోపించారు. నల్లగొండను సర్వనాశనం చేసింది కాంగ్రెస్ పార్టీయేనని, వ్యవసాయాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 7న జిల్లాలో ప్రారంభించిన అభివృద్ధి పనులన్నీ ఈ సంవత్సర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క అభివృద్ధి పనికి కూడా నిధులు కేటాయించలేదన్నారు. సీఎంతో కొత్త పనులకు శంకుస్థాపనలు చేయించే దమ్ము మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డిలకు లేదన్నారు. దేశంలో అతిపెద్దదైన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను కేసీఆర్ ముందు చూపుతో చేపట్టి 2027నాటికి 24వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి చేరుకోవాలని టార్గెట్‌గా పనిచేశారన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ఫ్లోరైడ్ మహమ్మారి విజృంభించిందన్నారు. అలాంటి మహమ్మారిని కేసీఆర్ మిషన్ భగీరథ నీటితో రూపుమాపారన్నారు. రాష్ట్రంలో రూ.30వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉండగా కేవలం రూ.12వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. తమ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలను రేవంత్ రెడ్డి తన ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటు అన్నారు. కేసీఆర్ పాలనలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు గోదావరి జలాలను తీసుకవస్తే ప్రస్తుతం ఆ నీళ్లు రాకుండా చేశారన్నారు. మంత్రుల జేబులు నిండాయి తప్ప కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమి లేదన్నారు. సమావేశంలో జడ్పీ మాజీ ఛైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నోముల భగత్, నాయకులు కటికం సత్తయ్యగౌడ్, బొర్ర సుధాకర్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాలె శరణ్యరెడ్డి, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, కరీంపాషా, కొండూరు సత్యనారాయణ, ఐతగోని యాదయ్య, వెంకటరెడ్డి, రావుల శ్రీనివాస్‌రెడ్డి, మారగోని గణేష్, గోపి పాల్గొన్నారు.

ఉమ్మడి సర్వీస్ నిబంధనలు అమలు చేయాలి

టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటికం రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రమేష్

నల్లగొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ రూల్ నిబంధనలు అమలు చేయాలని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటికం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి నూతన సర్వీస్ రూల్స్ మేరకు రెగ్యులర్ ప్రాతిపదికన ఎంఈవో, డైట్ లెక్చరర్స్ పదోన్నతులు కల్పించాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహించుకోవడం శుభ పరిణామం అన్నారు. నిలిచిన పదోన్నతులు వెంటనే చేపట్టాలని, పీఆర్సీ కమిటీ నివేదిక తెప్పించుకుని అమలు చేయాలన్నారు. 317 ఉత్తర్వుల మేరకు స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేసేలా ప్రభుత్వం విధానపర నిర్ణయాన్ని ప్రకటించాలని, బీఈడీ ఉన్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు పీఎస్ హెచ్‌ఎంగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో 33 జిల్లాలకు చెందిన టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు సంజీవరెడ్డి, కావలి అశోక్‌కుమార్, ముప్పిడి మల్లయ్య, విష్ణుమూర్తి, ధరావత్ రాములు, సుంకిశీల ప్రభాకర్‌రావు, నిమ్మనగోటి జనార్దన్, తరాల పరమేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాల్‌రెడ్డికి టీఆర్‌టీఎఫ్ మద్దతు

నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న శ్రీపాల్‌రెడ్డికి టీఆర్‌టీఎఫ్ సంఘం పూర్తి మద్దతు ప్రకటించింది. అందుకు సంబంధించిన లేఖను కూడా సంఘం నాయకులు అందజేశారు.

పర్యావరణ బాధ్యత అందరిది

వనజీవి రామయ్య



వనజీవి రామయ్య దంపతులను సన్మానిస్తున్న సందీప్, తదితరులు

మిర్యాలగూడ, మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పర్యావరణ బాధ్యత అందరిదని వనజీవి రామయ్య అన్నారు. ఆయన స్ఫూర్తితో 3లక్షల విత్తనాలను సేకరించిన సందర్భంగా ఆదివారం ఖమ్మంలో ఆయన్ను ప్రకృతి ప్రేమికుడు అవిరెండ్ల సందీప్, పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ యువకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ, ప్రకృతిని ప్రేమిస్తూ దాన్ని రక్షించేందుకు పాటుపడాలని సూచించారు. నీడనిచ్చే చెట్లతో పాటు ఔషధ మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. వేప, కానుగ, మర్రి, రాగి, పొగడ, నేరేడు, చింత మొక్కలు నాటాలని సూచించారు. విత్తనాల సేకరణలో సహకరించిన యువకులను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో దైద శ్రీను, కందికంటి విష్ణు, కందికంటి సైదులు, కిరణ్, రూహిద్, మణి, పవన్, సంపత్, పాషా, రాజశేఖర్, సాయినాథ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కదిలిస్తే కన్నీళ్లే..

- జలాల్‌పూర్ ఘటన యువకుల అంత్యక్రియలు పూర్తి
- కుమారులను తలుచుకుని రోదించిన తల్లిదండ్రులు





భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూర్ చెరువు కట్ట వద్ద మలుపులతో ప్రమాదభరితంగా ఉన్న రహదారి

యాదాద్రి జిల్లాలో అదుపు తప్పి చెరువులోకి కారు దూసుకెళ్లిన ఘటనలో మృతి చెందిన యువకులకు ఆదివారం అశ్రునయనాలతో అంత్యక్రియలు పూర్తయ్యాయి. కుమారులను తలుచుకుంటూ కుటుంబ సభ్యులు రోదించిన తీరు అందరినీ కలిచివేసింది. ఎవరిని కదిలించినా కన్నీళ్లు ఉబికి వచ్చాయి. చేతికందిన కుమారులు మృత్యువాతపడటం ఆయా కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. బంధువులు ఎంత ఓదార్చినా కుమారుల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

ఆ మలుపు మృత్యుకుహారం

ఐదుగురు యువకులను బలిగొన్న భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పూర్ చెరువు వద్ద మూలమలుపు ప్రమాదాలకు కేంద్రంగా మారింది. నాలుగేళ్లలో చాలా సంఘటనలు చోటుచేసుకున్నా, అధికారులు పట్టించుకోవడం లేదు. చెరువు కట్టను విస్తరించి, మలుపు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేయలేదు. ఈ మలుపు వద్ద ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. నాలుగేళ్లలో ప్రాణాలు కోల్పోయిన వారితో పాటు పెద్దసంఖ్యలో ద్విచక్రవాహనాలు కిందపడి గాయపడ్డ సంఘటనలూ ఉన్నాయి. ఇప్పటికైనా మలుపు వద్ద రహదారిని విస్తరించడంతో పాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

7

సాగర్‌లో కొనసాగుతున్న డ్రోన్ సర్వే

నాగార్జునసాగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో రివర్స్‌బుల్ పంపింగ్, విద్యుత్ ఉత్పత్తి చేసే సమయంలో ఏర్పడే అడ్డంకులను ఎదుర్కొనేందుకు జెన్‌కో ఆధ్వర్యంలో కేంద్ర సర్వే సంస్థ వ్యాప్‌కో డ్రోన్ సర్వే ఆదివారం కూడా కొనసాగింది. రివర్స్‌బుల్ పంపింగ్ సమయంలో విద్యుత్ ఉత్పత్తి చేయడానికి ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ముందున్న నీరు కావల్సినంతగా పంపింగ్ జరగడం లేదని, దీంతో టర్బైన్‌ల పనితీరుపై ప్రభావం పడుతోందని, అందుకే సర్వే నిర్వహిస్తున్నట్టు జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ తెలిపారు.

ఈ సర్వేను ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 21కిలోమీటర్ల దూరంలో ఉన్న టెయిల్‌పాండ్ వరకు నిర్వహిస్తామన్నారు. ఏడు టీఎంసీల నీటిలో మట్టి, రాళ్లు, కంకర, గుట్టలు ఎంత మేరకు ఉన్నాయో తెలుసుకొని, వాటిని తొలగించేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. డ్రోన్ సర్వేతో పాటు ఎకో సౌండ్ పద్ధతి, డ్రోన్ ఫొటోగ్రామెట్రి ఉపయోగించి హైడ్రోగ్రాఫిక్ పద్ధతిలో సర్వే చేస్తున్నామన్నారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలోకి నీటి పంపింగ్ చేసే పైప్‌లైన్లలో కూడా పేరుకుపోయిన మట్టి, ఇసుక, రాళ్లు, కంకరను ఈ హైడ్రోగ్రాఫిక్ విధానంలో గుర్తిస్తారన్నారు. సర్వే పూర్తయిన తర్వాత రివర్స్‌బుల్ పంపింగ్‌లో వచ్చే అడ్డంకులను తొలగిస్తామని సీఈ పేర్కొన్నారు.



నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్ కేంద్రం వద్ద డ్రోన్ సర్వే నిర్వహిస్తున్న ప్రతినిధులు



భక్తజనసంద్రం.. యాదగిరిక్షేత్రం

7

చిరుజల్లులతో తడిచిన ధాన్యం

రూ.1,203 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి

● 'ఆంధ్రజ్యోతి'తో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు



మోత్కూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తుంగతుర్తి నియోజకవర్గంలో యేడాది కాలంలో రూ.1,203కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం యేడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

రాష్ట్రంలో ప్రజాపాలన

రాష్ట్రంలో నియంతృత్వ పాలన అంతమై సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన సాగుతోంది. రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500లకు గ్యాస్ సిలిండర్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలవుతున్నాయి.

గత ప్రభుత్వం రూ.ఏడు లక్షల కోట్ల అప్పు చేసి పోవడం, విధివిధానాలు ఖరారు కాకపోవడంతో రైతు భరోసా లాంటి కొన్ని హామీల అములులో కొంత జాప్యం జరిగినా, త్వరలోనే అన్ని హామీలు అమలవుతాయి.

తట్టెడు ఇసుక పోనివ్వలే

ఎమ్మెల్యేగా తాను ఎన్నికయ్యాక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బిక్కేరు వాగు నుంచి తట్టెడు ఇసుక తరలించకుండా నిలిపివేశా. తిరుమలగిరి మండల కేంద్రానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ స్కూల్, మోత్కూరుకు కళాశాల హాస్టల్, తుంగతుర్తి, అడ్డగూడూరు మండలాలకు ఐటీఐ కళాశాల, బునాదిగాని కాల్వ నిర్మాణానికి రూ.266.65 కోట్లు మంజూరు చేయించా. మోత్కూరు, తిరుమలగిరి మునిసిపాలిటీల్లో అభివృద్ధి పనులకు ఒక్కోదానికి రూ.15 కోట్లు మంజూరు చేయించగా పనులు జరుగుతున్నాయి.

సమస్యల పరిష్కారానికి కృషి

తిమ్మాపురం నుంచి సంగెం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.32 కోట్లు, శాలిగౌరారం మండలం గురిజాల నుంచి అడ్డగూడూరు మండలం చౌళ్ల రామారం వరకు రూ.25 కోట్లతో డబుల్ బీటీ రోడ్డు మంజూరు చేయించా.

పూడిపోయిన అసిఫ్‌నహర్ కాల్వ మరమ్మతులకు, కాల్వకు భూమి కోల్పోయిన రైతులకు పరిహారం ఇప్పించేందుకు రూ.1.32 కోట్లు మంజూరు చేయించా. రానున్న నాలుగేళ్లలో తుంగతుర్తిలో పునాదితోనే ఆగినపోయిన 100పడకల ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు వైద్యసేవలు అందిస్తా.

తుంగతుర్తి, అడ్డగూడూరు మండలాల్లో పారిశ్రామిక వాడలు, తుంగతుర్తిలో రుద్రమచెరువు రిజర్వాయర్ ఏర్పాటుకు కృషి చేస్తా. మోత్కూరులో బిక్కేరు వాగుపై నూతన బ్రిడ్జి నిర్మాణం, మోత్కూరులో 30 పడకల ఆస్పత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తా. అసెంబ్లీ సమావేశాల్లో అవకాశం ఇచ్చినప్పుడల్లా నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తా.

ఏడాదిలో చేసిన పనులు సంతృప్తినిచ్చాయి

● 'ఆంధ్రజ్యోతి'తో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



భువనగిరి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా ఏడాది కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.850కోట్లతో పనులు మంజూరు చేయించా, ఈ ఏడాదిలో చేసిన అభివృద్ధి పనులు సంతృప్తినిచ్చాయి. రాబోయే నాలుగేళ్లలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఉమ్మడి జిల్లా మంత్రుల ప్రోత్సాహంతో భువనగిరిని ఆదర్శంగా తీర్చిదిద్ది ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తానని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

నిధులు మంజూరు చేయించా

భువనగిరి నియోజకవర్గంలోని మండలాలతో పాటు భువనగిరి, పోచంపల్లి మునిసిపాలిటీకి అభివృద్ధి పనులకు సుమారు రూ.850కోట్లు నిధులు మంజూరు చేయించా. అసంపూర్తి బునాదిగాని కాల్వ పనులకు రూ.269కోట్లు చేయించా. నవంబరు 30న బస్వాపూర్ రిజర్వాయర్ ఫీడర్‌ఛానల్ నుంచి నీటిని విడుదల చేసి భువనగిరి మండలంలోని ముత్తిరెడ్డిగూడెం, రాయిగిరి, కూనూరు, ముస్త్యాలపల్లి, చీమలకొండూరు చెరువులతో పాటు మరో ఎనిమిది చెరువులను నింపాము.భువనగిరి కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు, రోప్‌వే నిర్మాణానికి సుమారు రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయించా.

నిర్వాసితులకు రూ.50 కోట్లు మంజూరు

బస్వాపూర్ రిజర్వాయర్‌కు సంబంధించి బీఎన్ తిమ్మాపూర్ నిర్వాసితులకు రూ.200 కోట్ల వరకు పరిహారం చెల్లించాల్సి ఉంది. అయితే ప్రభుత్వం రూ.50కోట్ల నిధులు మంజూరు చేసింది. మిగితా నిధుల మంజూరుకు కృషి చేస్తా. రాయిగిరి ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్పిస్తానని హామీ ఇచ్చా. కానీ బీఆర్ఎస్‌ప్రభుత్వ హయాంలోనే త్రీజీ నోటిఫికేషన్లు జారీకావడంతో అలైన్‌మెంట్ మార్చలేని పరిస్థితి. వలిగొండ మండలంలో రహదారుల నిర్మాణానికి రూ.100కోట్లకు పైగా ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే వెంటనే అన్నిగ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణాలు చేపడుతాం.

న్యాయం చేశానన్న సంతృప్తి

ఏడాది పదవీ కాలం పూర్తి సంతృప్తినిచ్చింది. పదవికి న్యాయం చేశానన్న సంతృప్తి ఉంది. మూసీ పునరుజ్జీవానికి సీఎం రేవంత్‌రెడ్డి భువనగిరి నుంచే సంకల్పం తీసుకోవడం, బీమలింగం అభివృద్ధికి రూ.2కోట్లు మంజూరు చేశారు. మూసీ కాల్వలకు నిధుల మంజూరుతో రైతుల సాగు నీటి కష్టాలు తీరుతాయన్న ఆశ కలిగింది. భువనగిరిలోని సింగన్నగూడెంలో 444 డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలో మౌలిక సదుపాయాలు కల్పనకు రూ.2.75కోట్లు మంజూరు చేయాల్సి ఉంది. రూ.26కోట్లతో నియోజకవర్గంలో రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయి. భువనగిరి పరిధిలో రోడ్డు విస్తరణ పనులు అస్తవ్యస్తంగా చేపట్టడం, డ్రైనేజీల నిర్మాణంలో సాంకేతిక లోపం కారణంగా వర్షంతో వరద నీరు రహదారులపై ప్రవహించడం వాస్తవమే. ఆ సమస్య పరిష్కారానికి త్వరలో చర్యలు తీసుకుంటాం.

చెరువులను నింపిస్తా, వంతెనలను నిర్మిస్తాం

వచ్చే నాలుగేళ్లలో నియోజకవర్గవ్యాప్తంగా అన్నిపట్టణాలు, గ్రామాల్లో సాగు, తాగు కొరత లేకుండా చూస్తా, బస్వాపూర్ రిజర్వాయర్ కుడి కాల్వ ద్వారా భువనగిరి, బీబీనగర్ చెరువులను నింపిస్తాం. మూసీ, చిన్నేరు వాగులపై వంతెన నిర్మాణాలు పూర్తి చేసేందుకు కృషి చేస్తా. బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రిలో అన్నివిభాగాలకు సంబంధించి ఇన్‌పేషెంట్ సేవలు ప్రారంభించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లాకు చెందిన మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సహకారం తీసుకుంటా. భువనగిరి మండలం నందనం శివారులో అసంపూర్తిగా నిలిచిన తాటి ఉత్పత్తుల కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి గీత కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తా.

అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతా

● 'ఆంధ్రజ్యోతి'తో సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



హాలియా, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ నియోజకవర్గాన్ని జిల్లాలో, రాష్ట్రంలో మంత్రుల నియోజకవర్గాలతో సమానంగా అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతున్నానని నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా ఏడాది పూర్తయిన సందర్భంగా ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆంధ్రజ్యోతికి వివరించారు.

త్వరలోనే నెల్లికల్లు లిఫ్ట్ సాగునీరు

నెల్లికల్లు ఎత్తిపోతల పనులను వేగవంతం చేసి మొదటి ఫేజ్‌లోని సుమారు 4,200 ఎకరాలకు త్వరలోనే సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాం. అందుకు అవసరమైన అటీవీ భూములు నాలుగు ఎకరాలకు రూ.2.5 కోట్లు చెల్లించాం. ఎస్ఎల్‌బీసీలో లోలెవల్ కెనాల్‌పై ఎత్తిపోతల ఏర్పాటు చేయడం ద్వారా డీ -8,9 కాల్వలకు సాగునీరు అందించేందుకు నా తండ్రి జానారెడ్డి పనులు ప్రారంభించారు, అయితే మిగతా పనులు పూర్తి చేశాం. దీంతో 7,200 ఎకరాలకు సాగునీరు అందించేందుకు కొద్ది రోజుల క్రితమే ట్రయల్ రన్ పూర్తి చేశాం.

కొద్దిరోజుల్లోనే పాస్‌పుస్తకాలు

కృష్ణపట్టి ప్రాంతంలోని రైతాంగానికి పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించడానికి ఐదు నెలలుగా సర్వే చేస్తున్నాం. కబ్జాలో ఉన్న రైతులను గుర్తించే పనులను వేగవంతం చేశాం. కొద్దిరోజుల్లోనే రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను అందిస్తాం.

రహదారుల కోసం నిధులు

అల్వాల అడ్డరోడ్డు నుంచి తిరుమలగిరి మండలం కేంద్రం మీదుగా డొక్కలబావి, ముకుందాపురం వరకు రోడ్డు వెడల్పుకు రూ.70 కోట్లు మంజూరు చేయించా. చింతగూడెం నుంచి మారేపల్లి వరకు రూ.22 కోట్లు, పెద్దగూడెం నుంచి అన్నారం వరకు రూ.9.5కోట్లు, నెల్లికల్లు నుంచి నడిగడ్డ వరకు రూ.9 కోట్లు, బంకాపురం నుంచి వెనిగండ్ల వరకు రూ.3కోట్లు, ముకుందాపురం నుంచి కన్నెకల్ వరకు రూ.4 కోట్లు, అములూరు నుంచి ముక్కమాల వరకు రూ.5 కోట్లు, త్రిపురారం నుంచి అంజనపల్లి వరకు రూ.5 కోట్లు, కొంపల్లి నుంచి చిలుకాపురం రూ.2 కోట్లు, వేంపాడు నుంచి కన్నెకల్ వరకు రూ.3 కోట్లు, పార్వతీపురం నుంచి రాజన్నగూడెం వరకు రూ.2.5 కోట్లు రోడ్ల కోసం నిధులు మంజూరయ్యాయి. వీటితో పాటు నియోజకవర్గంలో 450 కిలోమీటర్ల మేర రోడ్లు రెన్యూవల్, కొత్తవాటి కోసం రూ.130 కోట్లతో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు నివేదిక సమర్పించా.

సాగర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

నాగార్జునసాగర్‌ను ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నాం. పర్యాటకుల కోసం కాటేజీలు, స్టార్ హోటల్ నిర్మాణం, వాటర్‌స్పోర్ట్స్ అభివృద్ధికి, సీప్లేన్ ద్వారా ప్రయాణం వంటి వాటి ఏర్పాటుకు కృషి చేస్తున్నాం.

నాలుగేళ్లలో రెట్టింపు అభివృద్ధి చేస్తా

మెరుగైన విద్యను అందించేందుకు సమీకృత గురుకుల విద్యాలయాన్ని మంజూరు చేయించా. వీటితో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో పార్టీలకతీతంగా ప్రజలకు అందిస్తున్నాం. నిధుల కొరతతో కొంత ఆలస్యమైనా అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నా. మరో 4 ఏళ్లలో రెట్టింపు అభివృద్ధి పనులు చేస్తాం.

పుష్ప.. తగ్గేదేలే



హీరో అల్లు అర్జున్ నటించిన పుష్ప-2 చిత్రం సందడి చేస్తోంది. తగ్గేదేలే అంటూ యువకులు, పిల్లలు పుష్పరాజ్ మేనరిజాన్ని ప్రదర్శిస్తున్నారు. చిత్రంలోని ఓ సన్నివేశంలో నటించిన అమ్మవారి పాత్ర విపరీతమైన క్రేజ్ లభించింది. రీల్స్ కోసం నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన 7వ తరగతి చదువు తున్న రాజేష్ అమ్మవారి గెటప్ వేసుకుని ఆదివారం రాఘవ థియేటర్‌కు వచ్చి సందడి చేశాడు. తన సోదరుడి సహకారంతో పది వరకు రీల్స్ చేశాడు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ, మిర్యాలగూడ టౌన్)

సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తాం

● దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



దేవరకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను 'ఆంధ్రజ్యోతి'కి ఆయన వివరించారు.

అసంపూర్తి రహదారులను పూర్తిచేశాం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాదిలోనే దేవరకొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో అసంపూర్తిగా వదిలేసిన రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాం. రూ.15 కోట్ల పంచాయతీరాజ్ నిధులతో నియోజకవర్గంలోని గ్రామాలకు రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. రూ.5కోట్లతో అంగన్‌వాడీ భవనాలు, గ్రామపంచాయతీ భవనాలను ఉపాధి నిధులతో పూర్తి చేశాం. రూ.10 కోట్లతో విద్యుత్ పనులను చేపట్టాం. దేవరకొండ నియోజకవర్గానికి రూ.10 కోట్లతో నాలుగు నూతన సబ్‌స్టేషన్లు మంజూరు చేయించా.

ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

రానున్న నాలుగేళ్లలో శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, నక్కలగండి, ఎస్ఎల్‌బీసీ ఓపెన్‌కెనాల్ పనులను పూర్తి చేస్తాం. ఇప్పటికే దేవరకొండ నియోజకవర్గంలో గుట్టలపై ఉన్న గ్రామాలకు తాగునీరు అందించేందుకు ఎత్తిపోతల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. మరో రెండు ఎత్తిపోతల పథకాలు త్వరలో మంజూరుచేస్తాం.

అందరికీ విద్యావసతులు

దేవరకొండ నియోజకవర్గంలో 20 ఎకరాల్లో రూ.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేసి అందరికి విద్య, వసతులు కల్పిస్తాం. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల నుంచి 200 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేసి రోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపడుతాం. అన్నిగ్రామాలకు రోడ్లు, తాగునీరు, మౌలిక సౌకర్యాలు కల్పిస్తాం. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు పంపిణీ చేస్తాం. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్‌ప్లాన్ నిధులను వారికే అందేలా చర్యలు చేపడుతున్నాం.

అత్తారింట్లో ఉంటూ ఆలయాల్లో చోరీలు

మిర్యాలగూడ అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అత్తారింట్లో ఉంటూ ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగను నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ పోలీసులు అరెస్టుచేశారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు తన కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలు వెల్లడించారు. దేవాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించామన్నారు. చోరీకి పాల్పడింది ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రాజీవ్ కాలనీకి చెందిన బీ మంజీత్‌సింగ్‌గా గుర్తించామని, కొంతకాలంగా మిర్యాలగూడలోని బాపూజీ నగర్‌లోని అత్తగారి ఇంటి వద్ద ఉంటూ చోరీలకు పాల్పతున్నట్లు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున ఆలగడప టోల్‌గేట్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీలో నిందితుడు మంజీత్‌సింగ్ తనకు సంబంధించిన ద్విచక్రవాహనంపై దేవాలయంలో దొంగిలించిన విగ్రహాలను పండ్లపెట్టెలో ఉంచి బస్తాలో మూటకట్టి తరలిస్తుండగా తనిఖీలో గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా ఆగస్టులో యాద్గార్‌పల్లిలోని శ్రీపార్వతి సమేత ఆగస్త్యేశ్వరస్వామి దేవాలయం తాళం పగులగొట్టి అమ్మవారికి చెందిన 4 పట్టు చీరలు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. అదేవిధంగా తాజాగా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో చోరీకి పాల్పడినట్లుగా నేరం అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడి నుంచి మోపెడ్‌తో పాటు దొంగిలించిన పార్వతి పరమేశ్వరుడు, చండీశ్వరుడు పంచలోహ విగ్రహాలతో పాటు మూలవిరాట్ శఠగోపురం, అందాజ 4 గ్రాముల బంగారు రెండు పుస్తెలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పార్వతీసమేత రామలింగేశ్వర ఆలయంలో చోరీ జరిపేందుకు నిందితుడు 15రోజులుగా ప్రయత్నించి ఈ నెల 6న పథకం ప్రకారం మూడుపంచలోహ విగ్రహాలు, శఠగోపురం, అమ్మవారి బంగారు పుస్తెలను కాజేసి పారిపోతున్న క్రమంలో పోలీసులకు చిక్కాడని డీఎస్పీ తెలిపాడు. ఆలయ పూజారి వీరభద్రయ్య ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. చోరీ జరిగిన 24గంటల్లోనే నిందితుడిని పట్టుకున్న వన్‌టౌన్ సీఐ కరుణాకర్, రూరల్ సీఐ వీరబాబు, ఎస్ఐ లోకేష్‌కుమార్, ఏఎస్ఐ రాములునాయక్, కానిస్టేబుళ్లు సైదానాయక్, శంకర్‌లను డీఎస్పీ అభినందించారు.



కేసువివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు, చిత్రంలో రికవరీ చేసిన పంచలోహవిగ్రహాలు

చోరీ సొమ్మురికవరీ

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాళ్లగడ్డ ఇందిరమ్మకాలనీకి చెందిన ఓ హోంగార్డు ఇంట్లో ఈ నెల 4వ తేదీన రూ.1.80లక్షల నగదు చోరీకి గురైంది. బీరువాలో దాచిన డబ్బును చోరీ చేసిన వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సదరు కేసులోని నిందితుడి నుంచి రూ.1.79లక్షల నగదును రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అయితే సదరు నిందితుడి వివరాలను మాత్రం వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

పాలకవీడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం పెద్ద సీతారంతండాకు చెందిన బానోతు విజయ(40) గురువారం తన అక్క బానోతు అస్సీతో కలిసి జాన్‌పహాడ్‌దర్గాకు నిద్రచేసేందుకు రాత్రి 10 గంటలకు వచ్చింది. దర్గాకు చేరుకున్న తరువాత విజయకు పరిచయం ఉన్న నేరేడుచర్ల మండలం బక్కయ్యగూడెం గ్రామానికి చెందిన శరత్‌కు ఫోన్‌చేసి దర్గా వద్దకు రావాలని కోరింది. దీంతో శరత్ మద్యం తీసుకుని రాత్రి 11గంటలకు చేరుకున్నాడు. వారు ముగ్గురు కలిసి దర్గా సమీపంలో మద్యం సేవించారు. అనంతరం విజయ అపస్మారకస్థితిలోకి వెళ్లింది. వెంటనే వారు 108 అంబులెన్స్‌కి ఫోన్‌చేసి మిర్యాలగూడ ఏరియాసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కామినేనిఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యం అందిస్తుండగా శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. భార్య మృతిపై అనుమానాలున్నట్లు భర్త లక్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. విజయకు ఒక కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

దేవరకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కాసారంలో చెట్టుకు ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దేవరకొండ సీఐ నర్సింహులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం కాసారం గ్రామానికి చెందిన అంబోజు మదార్, లక్ష్మమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు అంబోజు అంజనేయులు(22) తల్లిదండ్రులకు వ్యవసాయంలో సాయంగా ఉంటూ గొర్రెలను కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. వివాహం కాలేదు. శనివారం ఉదయం తల్లిదండ్రులతో కలిసి పొలం వద్దకు గొర్రెలను కాసేందుకు వెళ్లిన ఆంజనేయులు ఇంటికి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు గ్రామ సమీపంలోని బావి వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు. ఆదివారం దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి మదార్ ఫిర్యాదు చేయగా పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి విచారణ చేస్తున్నారు. అంజనేయులు మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని, తల్లిదండ్రులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

వీధికుక్కల దాడిలో గొర్రెలు మృతి

మేళ్లచెర్వు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం దొండపాడు గ్రామంలో వీధికుక్కల దాడిలో 8 గొర్రెపిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన దొంగల సైదులు ఆదివారం గొర్రెలను మేపేందుకు పొలానికి తీసుకెళ్లాడు. గొర్రెలకు పుట్టిన పిల్లలను ఇంటివద్దనే పశువుల కొట్టంలో ఉంచి తల్లి గొర్రెలను మేతకు తీసుకెళ్లిపోగా మధ్యాహ్నం ఇంట్లో ఉన్న గొర్రెపిల్లలపై వీధి కుక్కలు దాడిచేయటంతో మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఆదుకోవాలని బాధితుడు కోరారు.

మూడుతరాల బలగం

● వృద్ధ దంపతులకు 75 వసంతాలు ● మనమలు, మనుమరాళ్లతో ఏడు దశాబ్దాల వేడుక



అమరవరం గ్రామంలో లచ్చిరెడ్డి, అక్కమ్మ దంపతులను సన్మానిస్తున్న కుటుంబ సభ్యులు

హుజూర్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బంధాలు దూరమవుతున్న నేటి కాలంలో ఓ కుటుంబ సభ్యులు అనుబంధాన్ని చాటింది. మూడు తరాల కుటుంబ సభ్యులు కలిసి కుటుంబ పెద్ద అయిన దంపతులకు షష్టి పూర్తి వేడుకలు నిర్వహించారు. 95 ఏళ్ల తాతకు, 89ఏళ్ల నాయనమ్మకు షష్టి పూర్తి మహోత్సవాన్ని నిర్వహించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం అమరవరం గ్రామంలో ఆదివారం మూడుతరాల సభ్యులు కలిసి వేడుకలు నిర్వహించారు. అమరవరం గ్రామానికి చెందిన 95ఏళ్ల కర్నాటి లచ్చిరెడ్డి, 89ఏళ్ల అక్కమ్మ దంపతులకు కుటుంబ సభ్యులు షష్టి పూర్తి మహోత్సవం నిర్వహించారు. దీంతో ఆ వృద్ధ దంపతుల ఆనందం అవధులు దాటింది. ఈ దంపతులకు కుమారుడు సైదిరెడ్డి, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. మనుమలు, మనుమరాళ్లు కలిసి ఈ కుటుంబంలో 82మంది సభ్యులు ఉన్నారు. ఆదివారం అమరవరంలో కుమారులు, కుమార్తెలు, మనుమలు, మనుమరాళ్లు కలిసి లచ్చిరెడ్డికి షష్టి పూర్తి మహోత్సవం నిర్వహించారు. బంధుమిత్రులు కేక్ కట్ చేయించి కుటుంబ పెద్ద లచ్చిరెడ్డి, అక్కమ్మ దంపతులకు సన్మానించారు. అనంతరం గ్రామంలోని స్నేహితులు, బంధువులతో కలిసి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామపెద్దలు మాట్లాడుతూ, సమాజంలో మానవసంబంధాలను పెంపొందించుకోవాలన్నారు. కుటుంబ వ్యవస్థ విలువలను ప్రతీ ఒక్కరు చాటాలని, ఆదర్శంగా నిలిచేలా కుటుంబ వ్యవస్థను మెరుగు పర్చుకోవాలని ఆకాంక్షించారు.

తాళం వేసి పెళ్లికి వెళితే చోరీ

మిర్యాలగూడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో తాళం వేసిన ఇంటిలో చోరీ జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం భవిరిశెట్టి మధు, స్వప్న దంపతులు షాబునగర్‌లో నివాసముంటున్నారు. మధు విద్యుత్‌శాఖలో ఉద్యోగి, స్వప్న గృహిణి. హైదరాబాద్‌లో బంధుల ఇంట్లో పెళ్లికి బుధవారం ఇంటికి తాళం వేసి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటి వెనక తలుపు కొంచెం తెరచివుండటంతో పెళ్లికి వెళ్లి తిరిగి వచ్చారని భావించి పక్క ఇంటి వారు పిలిచినా శబ్దం రాలేదు. దీంతో మధు నెంబరుకు ఫోన్‌చేయగా తాము హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలిపారు. ఇంటి వెనుక తలుపు తెరిచివుందని చెప్పగా ఇంట్లోకి వెళ్లి చూడమని చెప్పడంతో పొరుగు ఇంటి వారు వీడియో కాల్ చేసి లోనికి వెళ్లారు. ఇంట్లో సామాను, చీరలు చిందరవందరగా మంచంపై పడివుండటం, ఇనుప బీరువాలు తెరిచివుండటంతో చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే మధు డయల్ 100కి ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. హైదరాబాద్ నుంచి వచ్చారు. ఇంట్లో బీరువాలో ఉంచిన సుమారు మూడు తులాల బంగారు నగలు, 200 గ్రాముల వెండితో పాటు స్వప్న తల్లికి చెందిన పెన్షన్ డబ్బులు రూ.20 వేల నగదుతో పాటు చిన్నకుమారుడి కిడ్డీబ్యాంకు(రూ.5 వేలు నగదు కలిగిన)ను కూడా దొంగలు ఎత్తుకెళ్లారని మధు దంపతులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సమీపంలోని సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

బాలెంలలోనూ..

సూర్యాపేటరూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం బాలెంల గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోరీజరిగింది. గ్రామానికి చెందిన ఆవుట నాగయ్య ఇంట్లో తెల్లవారుజామున దొంగ ఇంట్లోకి చొరబడి తులంన్నర బంగారం, 10 తులాల వెండి చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ బాలునాయక్ తెలిపారు.

నల్లగొండను బంగారు కొండ చేస్తా

(5వ పేజీ తరువాయి)

ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తాం. ఉమ్మడి జిల్లాలో ఎనిమిది ఐటీఐలలో ఏటీసీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం.

నల్లగొండకు ఔటర్ రింగురోడ్డు

నల్లగొండ పట్టణానికి ఇప్పటికే ఔటర్ రింగు రోడ్డు మంజూరు చేశాం. అదే విధంగా పట్టణంలో లతీఫ్‌సాహెబ్ గుట్ట, బ్రహ్మంగారి గుట్ట పైకి ఘాట్ రోడ్డుకు నిధుల మంజూరయ్యాయి. జిల్లాలో అన్ని రోడ్ల విస్తరణకు నిధులిస్తున్నాం.

పేద పిల్లలకు విద్యకు తోడ్పాటు

ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా పేద పిల్లల చదువుకు ఆర్థిక సాయం చేస్తున్నాం. అదే విధంగా నల్లగొండలో ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల సొంత ఖర్చులతో నిర్మిస్తున్నాం. విద్యా కార్యక్రమాలకు తోడ్పాటునందిస్తున్నాం.

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం

ఎక్కడున్నా, ఏ పదవిలో ఉన్నా, లేకున్నా నల్లగొండ జిల్లా సమగ్రాభివృద్దే ఏకైక లక్ష్యంతో పని చేస్తున్నా. రానున్న నాలుగేళ్లలో చరిత్రలో నిలిచేలా పనులు చేస్తా. నాలుగేళ్లే కాదు ఆ తదుపరి ఐదేళ్లు కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది.

మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం

మూసీ నది మురుగునీటితో, పరిశ్రమల కాలుష్యంతో నల్లగొండలో బతుకలేకుండా ఉంది. చిన్న పిల్లలకు క్యాన్సర్ వంటి రోగాలొస్తున్నాయ్. మూసీప్రక్షాళన చేసి జిల్లాను కాపాడే ప్రయత్నం చేస్తున్నాం. ప్రతిపక్షాలు అవగాహన లేకుండా వ్యవహరించడం తగదు. మూసీ ప్రక్షాళనకు అడ్డొస్తే జనం వాళ్ల సంగతి చూసుకుంటారు.

ఉమ్మడి జిల్లా సస్యశ్యామలమే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

పూర్తికి వచ్చే ఆగస్టు వరకు డెడెలైన్ ఇచ్చాం.

విద్యకు అగ్రతాంబూలం

పేద పిల్లలకు అంతర్జాతీయస్థాయి విద్యానందించేందుకు కంకణబద్ధులమయ్యాం. ప్రతీ మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే నియోజకవర్గానికి ఒకటి మంజూరు చేశాం. అదే విధంగా ఉపాధి అందించేలా నైపుణ్య శిక్షణకు ఏర్పాట్లు చేశాం. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చాం. నల్లగొండ, హుజూర్‌నగర్ సహా ఉమ్మడి జిల్లాలో ఎనిమిది చోట్ల వీటిని ఏర్పాటు చేశాం. అదే విధంగా హుజూర్‌నగర్‌లో డిగ్రీ కళాశాల, కోదాడలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేశాం.

దేశంలోనే అత్యధిక ధాన్యం ఉత్పత్తి

కాళేశ్వరం నీళ్లు లేకుండానే ఈ ఏడాది వానాకాలంలో రాష్ట్రంలో 66.76లక్షల ఎకరాల్లో 1.53కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి వచ్చింది.

ఇది జాతీయస్థాయి రికార్డు. దేశంలోనే నెంబర్ వన్‌గా తెలంగాణ నిలిచింది. మన ఉమ్మడి జిల్లాలో అందులో 20శాతం ధాన్యం ఉత్పత్తి చేసి రాష్ట్రంలో అగ్రభాగంలో ఉన్నాం. ఈ యాసంగిలో కూడా రైతులు సన్నాల సాగుచేయాలి. యాసంగి సన్న ధాన్యానికి కూడా రూ.500 బోనస్ ఇస్తాం.

చేయాల్సినవి ఇంకా ఎన్నో

(5వ పేజీ తరువాయి)

ఆదేశించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న దాదాపు 65 మినీ ఎత్తిపోతల పథకాలు కూడా సక్రమంగా నడిచేలా నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ చర్యలు తీసుకున్నారు. అదే విధంగా మిర్యాలగూడ, దేవరకొండ, సాగర్ నియోజకవర్గాల్లో నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకాల పనులను వేగంగా పూర్తి చేసి నీరివ్వాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ ఇటీవల సూచించారు. కోదాడ నియోజకవర్గంలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పనిచేయని ఎత్తిపోతల పథకాలను అందుబాటులోకి తెచ్చారు.

12.20లక్షల ఎకరాల్లో వరి సాగు

జిల్లాలో ఈ వానాకాలంలో 12.20లక్షల ఎకరాల్లో వరి సాగైంది. అందులో సగం మేర సన్నాలను రైతులు సాగుచేశారు. అయితే మిల్ పాయింట్ల వద్ద ధాన్యం కొనుగోళ్లలో రైతులను మిల్లర్లు ఏమార్చుతున్నా పట్టించుకోలేని నిస్సహాయ స్థితిని రైతులు ఎదుర్కొన్నారు. ఈ విషయంలో తొలుత ప్రభుత్వం విమర్శలు ఎదుర్కొన్నా ఆ తరువాత కొనుగోళ్లు సాఫీగా సాగాయి.

ఈ మలుపు మృత్యుకుహరం!

- జలాల్‌పూర్ చెరువుకట్టపై ప్రయాణం ప్రమాదభరితం
- ఐదుగురు యువకులను బలితీసుకున్న రహదారి
- అనేక ప్రమాదాలకు నిలయం

భూదాన్‌పోచంపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అసలే ఇరుకు రహదారి, ఆపై ప్రమాదకరంగా మూలమలుపు. దారి పక్కనే చెరువు. ఇది యాదాద్రిభువనగిరి జిల్లాలో ఐదుగురు యువకులను బలితీసుకున్న భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామశివారులోని చెరువు వద్ద రహదారి పరిస్థితి. ఇలాంటి సంఘటనలే గతంలోనూ చోటుచేసుకున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం, పక్కనే చెరువు ఉన్నట్లు హెచ్చరిక బోర్డులు, సూచిక బోర్డులు లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం వాహనాలతో రద్దీ

భూదాన్‌పోచంపల్లి అంతర్జాతీయ గ్రామీణ పర్యాటక గ్రామం. చేనేత ఇక్కత్ వస్త్రాలకు ప్రసిద్ధికావడంతో నిత్యం వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు, చేనేత వస్త్రాలను కొనుగోలు చేసేవారు, వ్యాపారులు వస్తుంటారు. ఈ రహదారిపై వాహనాల రద్దీ ఉంటుంది. అయితే ఈ రహదారిపై జలాల్‌పూర్ చెరువు కట్ట వద్దకు రాగానే ఇరువైపులా ప్రమాదకర మూలమలుపులు ఉన్నాయి. ఇరువైపులా చెట్లు, పొదలు దట్టంగా పెరిగి రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరికి వచ్చేంత వరకు సరిగా కనిపించవు. చెరువుకు గ్రీలింగ్(రక్షణ కవచం) గోడ లేకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూలమలుపుల సమీపంలో సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, చెరువుకు గ్రీలింగ్, రక్షణ గోడ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేగాక రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు, పొదలను తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు శనివారం రోడ్డు దుర్ఘటన జరిగిన నేపథ్యంలో గ్రామస్థులు పెద్దఎత్తున దర్నా నిర్వహించారు. చెరువు సమీపంలో మూలమలుపులు ఉన్నాయి. ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా ఎవరికీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


జలాల్‌పూర్ సమీపంలోని ప్రమాదకర మూలమలుపు, అవతల ఎదురుగా చెరువు(బాణం గుర్తు)

చెరవులోకి దూసుకెళ్తున్న వాహనాలు

ఈ మూలమలుపు వద్ద గత నాలుగేళ్లలోనే అనేక వాహనాలు ప్రమాదాలకు గురయ్యాయి.

- 2020 జూన్ 26న మలుపు వద్ద ఎదురుగా వచ్చిన కారు, బైకు ఢీకొట్టాయి. కారు చెరువులోకి దూసుకెళ్లడంతో పలువురికి గాయాలయ్యాయి.
- 2020 జూలై 22న హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌కు చెందిన జింక వంశీ, తన స్నేహితులతో కలిసి భూదాన్‌పోచంపల్లి మండలం రామలింగంపల్లిలోని బంధువుల ఇంటికి పెళ్లిపత్రిక ఇవ్వడానికి వస్తుండగా, ఇదే మలుపు వద్ద కారు అదుపు తప్పి, చెరువులోకి దూసుకెళ్లింది. వంశీ మృతి చెందగా, మిగతా వారు తీవ్రగాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు.
- 2023 జూలై 24న చెరువు కట్టపై పండ్ల లోడుతో వెళ్తున్న వాహనం బోల్తా పడింది.
- 2023 డిసెంబరు 5న జరిగిన ప్రమాదంలో ప్రశాంత్ అనే యువకుడు మృతి చెందాడు.
- ఈ ఏడాది జూలై 17న ఇటుకల లోడుతో వెళ్తున్న లారీ మూలమలుపు వద్ద అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లింది. డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు.
- ఈ నెల 7న ఉదయం కొత్తగూడెం నుంచి భూదాన్‌పోచంపల్లికి అతివేగంతో అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లింది.ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తీగుల్ల వంశీగౌడ్(23),వీరమల్ల విఘ్నేష్(20), ఇంద్రవల్లి హర్షవర్ధన్(22), కలకోటి అక్షయ్ అలియాస్ బల్లు(19), జెల్ల వినయ్(21) మృతి చెందారు. ఒక్కడు స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఇలాపదుల సంఖ్యలో బైక్‌లు అదుపుతప్పి చెరువులో పడి పలువురు గాయపడ్డారు.


ప్రమాదాలు నివారణకు చర్యలు చేపట్టాలి



జలాల్‌పూర్ చెరువు కట్ట వద్ద రహదారిపై మూలమలుపులో తరుచూ జరిగే ప్రమాదాల నివారణ తక్షణమే చర్యలు చేపట్టాలి. గతంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. శనివారం జరిగిన ప్రమాదంలో యువకులు జలసమాధి అయ్యారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలి.

పిట్ట శ్రీనివాస్‌రెడ్డి, జలాల్‌పూర్

గ్రిల్ ఏర్పాటుచేయాలి



జలాల్‌పూర్ చెరువు కట్టను విస్తరించాలి. రహదారి ఇరుకుగా ఉండడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారిని విస్తరించి చెరువుకట్టకు గ్రిల్ ఏర్పాటుచేయాలి. రెయిలింగ్ వాల్ ఏర్పాటుచేయాలి. ప్రమాదాలు నివారించాలి. అదేవిధంగా సూచిక బోర్డు ఏర్పాటు చేయాలి. రోడ్డుకిరువైపులా చెట్లను, పొదలను తొలగించాలి. వాహనాలు అతివేగంగా వెళ్లకుండా స్పీడ్ బ్రేకులను వేయాలి.

కొయ్యడ శ్రీనివాస్‌గౌడ్, జలాల్‌పూర్

కదిలిస్తే కన్నీళ్లే..

భూదాన్‌పోచంపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూర్ చెరువులోకి కారు దూసుకెళ్లిన ఘటనలో మృతి చెందిన ఐదు యువకుల ఇళ్లలో తీవ్రవిషాదం నెలకొంది. ఎవరినీ కదిలించినా కన్నీళ్లు ధారలైతున్నాయి. గుండెలను బాదుకుంటూ వారి జ్ఞాపకాలను తలుచుకుంటున్నారు. మృతదేహాలను భువనగిరి ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అక్కడ పోస్టుమార్టం నిర్వహించి వారి శవాలను కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు. వీరి అంత్యక్రియలు హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ ఆర్టీసీ కాలనీలో జరిగాయి. మృతుల కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

అందరూ మధ్యతరగతి కుటుంబీకులే..

మృతులందరూ మధ్యతరగతి కుటుంబీకులే. వివిధ గ్రామాల నుంచి హైదరాబాద్‌కు ఏళ్ల క్రితం వలస వచ్చి ఎల్‌బీనగర్‌లోని ఆర్టీసీ కాలనీ తదితర బస్తీల్లో నివసిస్తున్నారు. మృతుల్లో వినయ్, అక్షయ్‌లతోపాటు ప్రమదం నుంచి బయటపడిన మేడబోయిన మణికంఠ స్వస్థలం యాదాద్రి-భువనగిరి జిల్లా. మృతుల ఇళ్లలో ఏ ఇంట చూసినా విషాదఛాయలే అలుముకున్నాయి.

ప్రయోజకుడు అవుతాడనుకుంటే

పార్ట్ టైం జాబ్ చేస్తూ డిగ్రీ చదువుతున్న కుమారుడు విఘ్నేశ్వర్ జీవితం అర్థాంతంగా ముగియడంతో తండ్రి సత్యనారాయణ రోదనలు మిన్నంటాయి. కుమారుడిని తలుచుకుంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆయన రోదన స్థానికులను కంట తడిపెట్టించింది. రిటైరయిన ఆర్టీసీ కండక్టర్ సత్యనారాయణ- లక్ష్మీల చిన్నకుమారుడు విఘ్నేశ్వర్. వీరిది స్వస్థలం నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కొంపల్లి గ్రామం. ప్రయోజకుడు అవుతాడనుకుంటే ఇలా అయ్యింది అంటూ విలపించడంతో అంతా చలించిపోయారు.


రోదిస్తున్న విఘ్నేశ్వర్ తండ్రి సత్యనారాయణ

పొగిలి పొగిలి ఏడుస్తూ...

అయ్యో.. కొడుకా.. మేం ఇంట్లో ఉంటే ప్రమాదం తప్పేదేమో జెల్ల వినయ్ కుటుంబ సభ్యులు పొగిలి పొగిలి రోదించారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా, ఎత్తలేదంటూ వాపోయారు. సంఘటన జరిగిన రోజున ఉదయం గట్టుప్పల్ వెళ్లారు. అక్కడి నుంచి సాయంత్రం రామన్నపేట మండలంలోని స్వస్థలం బోగారం చేరుకున్నారు. రాత్రి అక్కడే ఉన్నారు. సాయంత్రం వినయ్ తండ్రి వెంకటేష్‌కి ఫోన్‌చేసి స్నేహితులతో కలిసి సినిమాకు వెళ్తున్నానని, రూ.300 కావాలని అడగ్గా ఫోన్‌పే చేశారు. అనుకోకుండా తాము ఊళ్లోనే ఉన్నామని, ఎల్‌బీనగర్‌లోని ఇంటికి తాము సాయంత్రమే వచ్చి ఉంటే కొడుకును పిలిపించుకునేవాళ్లమని తల్లి ఏడుస్తూ చెప్పింది. కాలేజీకి వెళ్లిన కొడుకు తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో రోదనలు మిన్నంటాయి. తండ్రి వెంకటేష్ ఆర్టీఏ ఏజెంటుగా పనిచేస్తున్నాడు. వీరి చిన్న కుమారుడు వినయ్. నాదర్‌గుల్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థి.


రోదిస్తున్న వినయ్ తల్లిదండ్రులు వెంకటేష్, వనజ

కారు ఘటనలో మృతులు


తీగుల్ల వంశీగౌడ్ వీరమల్ల విఘ్నేష్ కలకోటి అక్షయ్ ఇంద్రవల్లి హర్షవర్ధన్ జెల్ల వినయ్


ఆసుపత్రి మార్చురీ వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు

మల్కంబ్ జాతీయ పోటీలకు ట్రీనిటీ విద్యార్థులు

చౌటుప్పల్ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ట్రీనిటీ విద్యాసంస్థలకు చెందిన ముగ్గురు విద్యార్థులు మల్కంబ్ క్రీడల జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 9 వ తేదీ నుంచి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయిణిలో నిర్వహించే జాతీయ పోటీల్లో ఎం.సహస్ర, ఎస్.శ్రీహర్ష, కె.శ్రీగణేష్ పాల్గొననున్నారు. విద్యార్థులను ట్రీనిటీ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ వి.మంజుల, చైర్మన్ కృష్ణారావు అభినందించారు.


మల్కంబ్ జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ట్రీనిటీ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ మంజుల, చైర్మన్ కృష్ణారావు

కారు ఢీకొని మహిళ మృతి

నల్లగొండ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, ఆమె కుమారునికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని పానగల్-అద్దంకి బైపాస్ వద్ద ఆదివారం జరిగింది. బాధితులు, నల్లగొండ టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ షేర్‌బంగ్లాకు చెందిన ఎండీ రేష్మ(34) ఇళ్లల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. ఆదివారం ఉదయం లెప్రసీ కాలనీలో ఇంట్లో పనిచేసి ఆమె తన కుమారుడు రహమాన్‌తో కలిసి స్కూటీపై మిర్యాలగూడ రోడ్డులోని మైనార్టీ పాఠశాలలో చదువుతున్న ఆమె కుమార్తె తలీఫా వద్దకు వెళ్లివస్తుంది. ఈ క్రమంలో మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు డ్రైవర్ సత్యనారాయణ అజాగ్రత్తగా అతివేగంగా రేష్మ స్కూటీని ఢీకొట్టాడు. ఈ క్రమంలో రేష్మకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందగా బైక్ వెనకాల కుమారుడు రెహమాన్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతడిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. రేష్మ కొంతకాలంగా ఆమె భర్త మసూక్‌తో గొడవలతో దూరంగా ఉంటూ పిల్లలను పోషిస్తోంది. ఆమె తల్లి గౌసియా ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ టూటౌన్ ఎస్‌ఐ రావుల నాగరాజు తెలిపారు.

కోడిపందేల రాయుళ్ల అరెస్టు

చౌటుప్పల్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దేవలమ్మనాగారం శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్న ఐదుగురు యువకులను అరెస్టు చేసి రెండు కోళ్లు, రూ.6,500 నగదు, కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మన్మద కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దేవలమ్మనాగారం శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌వోటీ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. కోడి పందెంలో రెండు కోళ్లు మృతి చెందాయి. ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేయగా మరో ఐదుగురు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా 25కత్తులు, ఆరు బైక్‌లు కూడా స్వాధీనం చేసుకున్నామనారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భక్తజనసంద్రం.. యాదగిరిక్షేత్రం


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


యాదగిరిగుట్ట ప్రధాన ఆలయం వెలుపల భక్తుల సందడి

భువనగిరి అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యాదగిరిక్షేత్రం ఆదివారం భక్తజన సంద్రమైంది. వారాంతపు సెలవు దినం కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధికంగా వాహనాల్లో వచ్చారు. కొండపైన గర్భాలయంలో పంచనారసింహులతోపాటు శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కు తీర్చుకున్నారు. సుమారు 43వేల మంది భక్తులు ఇష్టదైవాలను దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఉభయ క్యూలైన్లల్లో భక్తులు బారులు తీరగా, ప్రత్యేక దర్శనానికి అరగంట, ధర్మదర్శనానికి గంట సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. కాగా, క్యూకాంప్లెక్స్‌లతోపాటు ప్రధానాలయం, కల్యాణోత్సవ మండపం, వ్రతమండపాలు, ఆలయ తిరువీధులు, శివాలయం, ప్రసాద విక్రయశాల, కొండకింద వ్రత మండపం, లక్ష్మీపుష్కరిణి, అన్నదాన సత్రం, కల్యాణ కట్ట తదితర ప్రాంగణాల్లో భక్తులతో సందడి నెలకొంది. ఆలయ ఉత్తర దిశలో భక్తులు ఫొటోలకు దిగేందుకు పోటీపడ్డారు. రద్దీకి తగినట్లు కొండపైకి, కిందికి భక్తులను తరలించేందుకు అధికారులు బస్సులను ఏర్పాటు చేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.63,17,011 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాతసేవతో స్వామి అమ్మవార్లను మేల్కొల్పిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణపర్వాలు వైభవంగా చేపట్టారు. పాతగుట్ట స్వామి అమ్మవారలకు నిత్యపూజలు నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్యపూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో నిర్వహించారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ద్వారబంధనం చేశారు.

అయ్యప్ప స్వాములకు ప్రత్యేక దర్శనం

స్వామివారి దర్శనానికి వచ్చే అయ్యప్ప స్వాములకు ఈ నెల 11న (బుధవారం) ప్రత్యేకంగా గిరిప్రదక్షిణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. తొలిసారిగా ప్రవేశపెట్టిన ఈ విధానం ఉదయం 6గంటలకు ప్రారంభమై ప్రదక్షిణ పూర్తి చేసుకున్న స్వాముల కోసం ఉదయం 7 నుంచి 8.45గంటలకు ప్రత్యేక దర్శనంతో పాటు ప్రసాదం అందజేయనున్నట్లు వివరించారు.

'కార్తీక' ఆదాయం పెరుగుదల

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఖజానాకు కార్తీక మాసంలో రూ.2.95కోట్లు అధికంగా ఆదాయం సమకూరింది. నాలుగు విభాగాల్లో ఆదాయం గత ఏడాదికన్నా స్వల్పంగా తగ్గింది. వాహన పూజలు, శీఘ్రదర్శనం, ప్రచార శాఖ, సువర్ణ పుష్పార్చన, శాశ్వత పూజలు, పుష్కరిణిలో స్నాన సంకల్పం విభాగాల్లో తక్కువ ఆదాయం సమకూరింది. కార్తీక మాసం నవంబరు 2వ తేదీన ప్రారంభమై డిసెంబరు 1వ తేదీన ముగిసింది. సుమారు నెల రోజుల పాటు 23,248మంది దంపతులు వ్రతాలను ఆచరించారు. 2023 సంవత్సరం కార్తీక మాసంలో 20,524 వ్రతాలు జరిగాయి. గతంతో పోల్చితే ఈ ఏడాది 2,724జంటలు అధికంగా వ్రతాల్లో పాల్గొన్నాయి. 2023కార్తీక మాసంలో వివిధ విభాగాల ద్వారా రూ.15,08,36, 661.78 ఆదాయం సమకూరగా, 2024 కార్తీక మాసంలో రూ.18,03,40,051 ఆదాయం సమకూరింది. గత ఏడాదికన్నా రూ.2,95,03,389.22 అదనపు ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు. ఇందులో గత సంవత్సరం వాహ న పూజల ద్వారా రూ.3,91,600 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.3,75,600 ఆదాయం సమకూరింది. రూ. 16,000 తగ్గింది. శీఘ్రదర్శనం (రూ.50) గత ఏడాది రూ.1,91,950 ఆదాయానికి ఈ ఏడు రూ. 1,72,600 రాగా రూ. 19,350 తగ్గింది. ప్రచార శాఖకు గతంలో రూ.15,04,257 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.10,78,018వచ్చింది. రూ.4,26,239 తగ్గింది. గతంలో సువర్ణ పుష్పార్చన రూ.27,61,200 ఆదాయం రాగా ఈ ఏడాది రూ. 19,05,300 ఆదాయం రాగా రూ.8,55,900 తగ్గింది. శాశ్వత పూజల ద్వారా గతంలో రూ.8,00, 001 రాగా ఈ ఏడాది రూ. 6,85,000 సమకూరింది. రూ.1,15, 001 తగ్గింది. పుష్కరిణిలో స్నాన సంకల్పానికి గతంలో రూ. 55,450 ఆదా యం రాగా ఈ ఏడాది రూ. 42,750 సమకూరింది. రూ. 12,700 తగ్గింది. ఇతర పద్దుల ద్వారా గతంలో రూ.2,37,89,517సమకూరగా ఈసారి రూ. 2,27,56,628 సమకూరి రూ.10,32,889 తక్కువగా ఆదాయం సమకూరింది. మిగతా విభాగాల్లో ఈ ఏడాది యాదగిరీశుడి కార్తీక రాబడి రూ.2.95కోట్లు పెరిగింది.

వివరాలు	2023లో (రూ.)	2024లో (రూ.)	వ్యత్యాసం
కేశఖండనం	18,84,900	20,09,350	1,24,450
ప్రధాన బుకింగ్ అర్జిత సేవలు	65,12,738	76,20,176	11,07,438
వీఐపీ (రూ.300) బ్రేక్ దర్శనం	70,19,100	81,01,000	10,81,900
సత్యదేవుని వ్రతాలు	1,64,20,600	1,86,10,400	21,89,800
వాహన పూజలు	3,91,600	3,75,600	16,000
వీఐపీ (రూ.150)	99,00,000	1,37,48,550	38,48,550
శీఘ్రదర్శనం (రూ.50)	1,91,950	1,72,600	19,350
ప్రచార శాఖ	15,04,257	10,78,018	4,26,239
కొండపైకి వాహనాల ప్రవేశ రుసుం	1,13,50,000	1,23,50,000	10,00,000
యాదరుషీ నిలయం గదుల కిరాయి	28,18,165	32,21,804	4,03,639
సువర్ణ పుష్పార్చన	27,61,200	19,05,300	8,55,900
శివాలయం	3,79,550	4,87,150	1,07,600
శాశ్వత పూజలు	8,00,001	6,85,000	1,15,001
పుష్కరిణి స్నాన సంకల్పం	55,450	42,750	12,700
లాకర్లు	7,040	7,040	-
ప్రసాదాల విక్రయం	3,50,79,660	3,71,94,240	21,14,580
లీజులు/లైసెన్ల ఆదాయం	45,70,702	74,07,722	28,37,020
హుండీల ఆదాయం	2,36,80,641	3,75,20,004	1,38,39,363
ఇతర పద్దుల ఆదాయం	2,37,89,517	2,27,56,628	10,32,889
అన్నప్రసాదం	17,25,510	24,94,141	7,68,630
విమాన గోపురానికి విరాళం	1,120	25,52,578	25,51,458
మొత్తం	**15,08,36,661**	**18,03,40,051**	**2,95,03,389**

ఇక్కత్ డిజైన్ల ప్రింట్ అరికట్టేందుకు కృషి చేస్తా

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి


ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి సమస్యలు విన్నవించి సన్మానిస్తున్న పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు లవకుమార్, ప్రతినిధులు

భూదాన్‌పోచంపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పోచంపల్లి చేనేత టై అండ్ డై ఇక్కత్ వస్త్రాల డిజైన్లను ప్రింట్ చేయకుండా అరికట్టేందుకు తనవంతు కృషి చేస్తానని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. భూదాన్‌పోచంపల్లిలోని చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్ ఆధ్వర్యంలో కార్యవర్గం సభ్యులు ఆదివారం ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి సమస్యలు విన్నవించారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చేనేత ప్రతినిధులు మాట్లాడుతూ పోచంపల్లి ఇక్కత్ పరిశ్రమ నేడు పవర్‌లూమ్‌లపై ప్రింట్ కావడం వల్ల ఒరిజినల్ ఇక్కత్‌కు డిమాండ్ తగ్గుతుందని అన్నారు. గుజరాత్‌లోని సూరత్, బరోడా, అహ్మదాబాద్‌తో పాటు తమిళనాడు, కేరళ ఇతర ప్రాంతాల్లో ప్రింటింగ్ అవుతున్నాయని, వాటిని అరికట్టాలని కోరారు. ప్రస్తుతం ఆయన టెక్స్‌టైల్ దేశ కమిటీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. తద్వారా ఈ సమస్యను పార్లమెంట్‌లో ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, ప్రింటింగ్‌ను అరికట్టాలని, పోచంపల్లి డిజైన్లకు కల్పించిన పే టెంట్ రైట్స్‌ను పరిరక్షించాలని ఎంపీకి విన్నవించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వ పరంగా తాను ఈ సమస్య పరిష్కా రం కోసం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ తడక యాదగిరి, కర్నాటి బాలరాజు, ఉపాధ్యక్షుడు కుడికాల రామనర్సింహ, సహాయ కార్యదర్శి గంజి బాలరాజు, కోశాధికారి మంగళపల్లి రమేష్, కార్యవర్గ సభ్యులు సీత భవాని, సీత కృష్ణ, ఏకెఎల్‌బీ వర్తక సంఘం అధ్యక్షుడు గుండు శ్రీరాములు, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొట్టం కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనేత పడుగు పేకల ఆత్మీయ సదస్సు విజయవంతం చేయాలి

భూదాన్‌పోచంపల్లి: రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన చేనేత పడుగు పేకల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని పద్మశాలీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్, ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, చేనేత సంఘం రాష్ట్ర నాయకుడు కూరపాటి రమేష్ పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలో చేనేత పడుగు పేకల ఆత్మీయ సదస్సు పోస్టర్లను ఆదివారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఆత్మీయ కలయిక ద్వారా చేనేత సమస్యలు విన్నవించుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, పోచంపల్లి పద్మశాలీ చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, ఉపాధ్యక్షుడు భారత భూషణం, నాయకులు బొమ్మ హరిశంకర్, బిట్ల గణేష్, కోశాధికారి రుద్ర సూర్యప్రకాష్, డైరెక్టర్లు పొట్టబత్తిని వేణుకుమార్, కటకం శ్యాంసుందర్, గుండేటి శివరాజు, కూరపాటి భాస్కర్, గుండు రాజేశ్వరి, గుర్రం హేమలత, చింతకింది రమేష్, శ్రీహరి, భిక్షపతి, శ్రీనివాస్, రామకృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.


చేనేత పడుగు పేకల ఆత్మీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చిరు జల్లులు.. రైతుల్లో గుబులు





నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల పరిధిలోని పెండ్లిపాకల రోడ్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యాన్ని ఎండబెట్టుకున్నారు. కాగా ఆదివారం కురిసిన వర్షానికి ధాన్యం తడవడంతో రైతులు ధాన్యాన్ని కుప్పలుగా చేసి పట్టాలతో కప్పి ఉంచారు. వర్షం సూచనలతో ధాన్యం విక్రయం ఇబ్బంది కరంగా మారిందని రైతులు పేర్కొంటున్నారు.

- కొండమల్లేపల్లి, (ఆంధ్రజ్యోతి)

సమీకృత మార్కెట్ పూర్తయ్యేది ఎప్పుడో!

» రూ. 2 కోట్లు మంజూరైనా ముందుకు సాగని పనులు
» ట్రాఫిక్‌తో సతమతమవుతున్న ప్రజలు

చండూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చండూరు మునిసిపాలిటీలో సమీకృత మార్కెట్ నిర్మాణానికి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2 కోట్లు నిధులు వెచ్చించింది. పట్టణంలో ప్రతీ శుక్రవారం నిర్వహించే వార సంత కారణంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతుంది. ఈ సంతకు మునుగోడు, నాంపల్లి, మర్రిగూడ, కనగల్, గుర్రంపోడ్, మాల్, నల్లగొండ, సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్, గట్టుప్పల మండలాలకు చెందిన వ్యాపారులు క్రయ, విక్రయాల కోసం వస్తుంటారు. సంతకు వచ్చేవారికి కనీస సదుపాయాలు లేకపోవడంతో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పక్కనే మాంసం, కూరగాయలు, ఇతర విక్రయాలు జరుగుతుండటంతో వ్యర్థాలతో రోడ్డు అపరిశుభ్రంగా మారుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో 2023 జనవరి 6న సమీకృత మార్కెట్ భవన నిర్మాణానికి, అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించి రెండేళ్లు పూర్తి కావస్తున్నా, నేటికీ పూర్తి కాకపోవడంతో చిరు వ్యాపారులు, మాంసం దుకాణదారులు రోడ్డు వెంట విక్రయాలు సాగిస్తుండటంతో ట్రాఫిక సమస్య తలెత్తడంతో పాటు, ఆహారపదార్థాలు, మాంసం కలుషితమవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీకృత మార్కెట్ భవనం నిర్మాణం పూర్తి చేయడానికి పాలకవర్గం చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.



మార్కెట్ సదుపాయం లేకపోవడంతో రోడ్డుపై నిర్వహిస్తున్న సంత



అన్నీ ఒకేచోట

సమీకృత మార్కెట్‌లో మాంసం, కూరగాయలు, పూలు, పండ్లు ఇలా అన్నీ ఒకేచోట విక్రయిస్తారు.ఇందుకోసం 50 షెడ్లు నిర్మిస్తారు. వీధి దీపాలు,సీసీ రోడ్లు,మంచి నీరు ఇతర మౌలిక సదుపాయాలు ఉంటాయి.ఎండ, వాన కురిసినా ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. విద్యుత్ వెలుగులతో రాత్రిపూట కూడా మార్కెట్ సదుపాయం కూడా ఉంటుంది.

తీరనున్న సంత సమస్యలు

ప్రతీ శుక్రవారం చండూరు చౌరస్తాలో వార సంత ఉంటుంది. మున్సిపాలిటీ కార్యాలయం వెనక, రోడ్డు వెంట సంత సాగుతుండటంతో ప్రజలు అంతా ఒక చోట గుమిగూడుతుంటారు. వాహనాలు సైతం అక్కడే నిలిపి క్రయ విక్రయిలు చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆటోలు, బస్సులు, పాఠశాలల బస్సులు రోడ్డుపైకి రావడంతో ప్రజలు రోడ్డు దాటే పరిస్థితి ఉండదు. అదే సమీకృత మార్కెట్ భవనం పూర్తయితే ఈ సమస్య ఉండదు.

నిధులు మంజూరైతే పనులు పూర్తి



ఇప్పటి వరకు భవన నిర్మాణానికి మంజూరైన నిధుల వరకు మాత్రమే గుత్తేదారుడు పనులు పూర్తి చేశాడు. మిగతా నిధులు విడుదల కావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి అదనంగా మరిన్ని నిధులు మంజూరు చేస్తే పూర్తవుతుంది.

- నాగదుర్గాప్రసాద్,ఏఈ, పబ్లిక్ హెల్త్

పనులు పూర్తి చేయాలి



నాటి ప్రభుత్వం సమీకృత మార్కెట్ భవన నిర్మాణం పనులు పూర్తి చేసి వ్యాపారస్తులకు, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ఆ దిశగా అధికారులు చొరవ చూపాలి.

- తోకల చంద్రకళవెంకన్న, మనిసిపల్ చైర్‌పర్సన్, చండూరు

మరమ్మతులకు నిధుల మంజూరుపై హర్షం

కనగల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ నుంచి వయా కనగల్ తిమ్మన్నగూడెం స్టేజీ సాగర్‌రోడ్డు వరకు 26 కిలోమీటర్ల పొడవున రహదారి విస్తరణ మరమ్మతులకు రూ. 14 కోట్ల నిధులు మంజూరు చేయడంపై జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించటంపై ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కనగల్ నుంచి తిమ్మన్నగూడెం స్టేజీ సాగర్‌రోడ్డు వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతిని వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. నిధుల మంజూరీకి కృషి చేసిన ముఖ్యమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వారు మండల ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సినీనటి అరియానా గ్లోరీ

మునుగోడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సినీనటి అరియానా గ్లోరీ అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, కేవీఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కర్నాటి విద్యాసాగర్ జన్మదినం సందర్భంగా ఆదివారం మునుగోడు హైస్కూల్ ఆవరణలో ఏర్పా టు చేసిన వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి చెందిన వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో సుమారు ఆరు వందల మంది వరకు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి అవసరమైన వివిధ రకాల మందులను ఉచితంగా అందజేశారు. శిబిరంలో సినీనటి అరియానా గ్లోరీ సందడి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోమ్మరబోయిన రాజు ముదిరాజ్, ఆర్గనైజర్లు బొడ్డు నాగరాజుగౌడ్, అనగంటి కృష్ణ, నరేందర్‌గౌడ్, దొంతరగోని వెంకటేష్, సోమ రవికుమార్, కొంపల్లి వెంకన్న పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డికి జ్ఞాపిక అందజేత



వెంకట్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నార్కట్‌పల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణవెల్లెంల ఉదయసముద్రం ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రారంభించి జాతికి అంకితం చేయడాన్ని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం నార్కట్‌పల్లిలో ని ర్వహించిన కార్యక్రమంలో ఆయకట్టు రైతుల పక్షాన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ధాన్యం బస్తాలతో కూడిన ఎడ్లబండిని నడుపుతున్న రైతు జ్ఞాపికను కాంగ్రెస్ నాయకులు బహూకరించారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టు ప్రారంభమయ్యేలా కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్, నార్కట్‌పల్లి మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు వడ్డే భూపాల్‌రెడ్డి, పల్లె నరేందర్‌రెడ్డి, చిక్కుళ్ల శివ, ఉదయ్, రేగట్టె సతీష్, అంతటి స్వామి పాల్గొన్నారు.

నాగరాజుకు మహారక్తదాన అవార్డు

నార్కట్‌పల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లికి చెందిన సామాజిక కార్యకర్త మనం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు దైద నాగరాజుకు మహా రక్తదాన అవార్డు లభించింది. మనం స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి ఆదివారం నాటికి వంద రోజులు పూర్తయింది. ఈ సందర్భంగా జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ, ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రంలో సౌజన్యంతో మహా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 70 మందితో రక్తదానం చేయించారు. ఈ సందర్భంగా దైద నాగరాజుకు ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ డాక్టర్లు మహా రక్తదాన అవార్డును బహూకరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్లు అరుణ, సుహాసిని, యాస్మిన్‌లతో పాటు స్థానికులు వాసు, నగేష్, రవికుమార్, సంతోష్, అనురాధ, శంషుద్దీన్, రవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

కనగల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రతి ఉన్నత పాఠశాలకో బస్సును ఏర్పాటు చేసి సర్కారు బడులను బలోపేతం చేయాలని సామాజిక సేవా కార్యకర్త డాక్టర్ నీలకంఠం శేఖర్ కోరారు. పాఠశాలలకు వెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యాలు లేకపోవటంతో చాలామంది తల్లిదండ్రులు వారి పిల్లలను బస్సు సౌకర్యం ఉన్న ప్రైవేట్ పాఠశాలలకు పంపుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఉన్నత పాఠశాలకో బస్సు సర్వీసును ఏర్పాటు చేస్తే బడికి వచ్చే పిల్లల సంఖ్య పెరుగుతుందని తెలిపారు. ఆ దిశగా ప్రభుత్వ పెద్దలు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

'ఆశా'ల హామీలను వెంటనే అమలుచేయాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నల్లగొండరూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాద బీమా, ఈఎస్ ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకుడు పెంజర్ల సైదులు, ఆశా యూనియన్ నాయకులు మహేశ్వరి, ఆర్. కవిత, జి.విమల తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టాలి



ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

● ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం

చిట్యాలరూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాలను సాధించిన వారు ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను కూడా చేపట్టాలని గుండ్రాంపల్లి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గండూరి వెంకటేశ్వర్లు, అధ్యక్ష, కార్యదర్శులు మారుపాక అంజయ్య గరిశె అంజయ్య అన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో ఆదివారం గుండ్రాంపల్లి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలను సాధించిన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కష్టపడి చదివి ఉద్యోగాలను సాధించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి పంతంగి వెంకటేశం, సభ్యులు రెడపాక యాదయ్య, ఎండది. యూసూఫ్, అన్నెబోయిన రమేష్, బుస్సు శంకరమ్మ, వీరమళ్ల శ్రీనివాస్, గోపగోని పద్మ, శ్రీనివాస్, అంజయ్య శివలింగం, సాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా వ్యవసాయ అధికారి పి.శ్రవణ్‌కుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్

నల్లగొండ టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పి.శ్రవణ్‌కుమార్ అన్నారు. నల్లగొండ పట్టణంలో ఆదివారం నిర్వహించిన విశ్వవిజేత అగ్రోస్ ప్రైవేట్ లిమిటెడ్ (వికాస్ అగ్రోస్) సంస్థ నల్లగొండ జోన్ 27వ వార్షికోత్సవ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంస్థ ఉత్పత్తులను జాతీయస్థాయిలో రైతులకు అందించడానికి బ్రాండ్ విలువే కారణమన్నారు. 27 సంవత్సరాలుగా సంస్థ మార్కెట్‌లో నిలబడిన తీరు చాలా కంపెనీలకు ఆదర్శనీయమన్నారు. వికాస్ అగ్రోస్ సంస్థ ఎండీ కనగాల సత్యనారాయణ మాట్లాడుతూ 27 సంవత్సరాల క్రితం జింకు ఉత్పత్తులతో తొలిసారిగా నల్లగొండ నుంచే ప్రస్థానం ప్రారంభించినట్లు తెలిపారు. నెల రోజుల క్రితమే రైతులకు పురుగు మందులను ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రూ.32లక్షల విలువైన మందులను విక్రయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విక్రయాల్లో ప్రతిభ చూపిన డీలర్లను జిల్లా వ్యవసాయ అధికారితో కలిసి ఎండీ సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో వికాస్ అగ్రోస్ చీఫ్ మేనేజర్ వి.విజయ్‌కుమార్, రీజనల్ మేనేజర్ నర్సింహారావు, డీజీఎం సుందర్‌రావు పాల్గొన్నారు.

వైభవంగా నిష్కళంక మాత ఉత్సవాలు



చిన్నపురిలో విద్యుత్ దీపాల అలంకరణలో చర్చి

కట్టంగూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపురి గ్రామంలో ఆదివారం గ్రామదేవాలయ నిష్కలంక మాత ఉత్సవాలను గ్రామస్థులు వైభవంగా నిర్వ హించారు. గ్రామస్థులందరూ కలిసి మత గురువు ఆధ్వర్యంలో గ్రామంలోని చర్చిని సుందరంగా అలకరించారు. భక్తి గీతాలతో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. డిసెంబరు 8వ తేదీన నిష్కళంక మాత ఉత్సవాలు నిర్వహిస్తామని గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ పసల గ్రేగోర్రి, కొంక ప్రవీణ్, అలెగ్జాండర్, రాయప్ప, జోసఫ్ అంటోని, విలియం, జయపాల్ ప్రసాద్, పరయ్య, విజయ్, శ్యాం, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ క్షేత్రంలో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కనగల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావటంతో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదిక్షణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమ అభిషేక పూజలు జరిపించి చీర సారె, ఒడిబియ్యం బోనం నైవేద్యాలను సమర్పించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయసిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

కట్టంగూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ రైతు గత 17రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం అయిటిపాముల గ్రామానికి చెందిన కొప్పు నాగరాజు (38) అనే యువరైతు తనకున్న 1.10 ఎకరాలతో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. అంతేకాక ఇంటి అవసరాల నిమిత్తం సుమారు రూ.5లక్షల వరకు అప్పు చేశాడు. చేసిన అప్పులు తీర్చలేనన్న మానసిక వేదనతో నవంబరు 21వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. అప్పుడే ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అదేరోజు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

మృతి చెందినా మరొకరికి వెలుగునిస్తూ

● గుండెపోటుతో మృతి చెందిన వ్యక్తి నేత్రదానం



ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

కనగల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తేలకంటిగూడెం గ్రామానికి చెందిన నామిరెడ్డి ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి నేత్రాలను దానం చేయాలని నల్లగొండ లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ హరనాథ్, ప్రముఖ నేత్రవైద్య నిపుణుడు డాక్టర్ పుల్లారావు అతని కుటుంబ సభ్యులను సంప్రదించగా నేత్రదానానికి వారు ఒప్పుకున్నారు. దీంతో ప్రవీణ్ కుమార్‌రెడ్డి మృతి చెందినా ఇతరులకు తన నేత్రాల ద్వారా వెలుగు నింపనున్నారు. దుఃఖంలోనూ కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయాన్ని పలువురు అభినందిస్తున్నారు.

చేయూత

సహ విద్యార్థికి రూ.64వేల ఆర్థికసాయం

నార్కట్‌పల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన తోటి విద్యార్థి కుటుంబానికి సహచర మిత్రులు అండగా నిలిచారు. విరాళాలు సేకరించి ఆర్థిక సాయం అందించారు. నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల జడ్పీ ఉన్నత పాఠశాల (2003-04) 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన చింతకింది అనిల్ అనే పూర్వ విద్యార్థి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల చనిపోయాడు. విషయం తెలుసుకున్న క్లాస్‌మేట్లు ఎలాగైనా తమ స్నేహితుని కుటుంబానికి అండగా నిలవాలని భావించి రూ.64 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కోమటిరెడ్డి నర్సిరెడ్డి, గుజ్జ గోవర్ధన్, దామర పర్వతాలు, ముక్కాముల నాగరాజు, చిరుమర్తి శివరాజు, సిరసనవాడ నర్సింహ, బొడ్డుపల్లి శంకర్, కాసం అశోక్, రామోజు మదనాచారి, బొల్గూరి లింగస్వామి, కృష్ణ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

మునుగోడురూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మునుగోడు మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన నందిపాటి ముత్తయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు వట్టికోటి శేఖర్ ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థికసాయం అందించి వారిని ఓదార్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, నాయకులు మునుకుంట్ల పరమేష్, కర్నాటి వెంకటేష్, శంకరయ్య, బోయ లక్ష్మణ్, బోయ సతీష్, నందిపాటి జనార్థన్ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి-మాండ్ర రోడ్డుకు మహర్దశ

● పీఆర్ రోడ్డు ఆర్‌అండ్‌బీకి మార్పు
● సుమారు రూ.14 కోట్లతో రోడ్డు వెడల్పునకు ప్రతిపాదనలు

నార్కట్‌పల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు దెబ్బతిని గుంతలమయమైన నార్కట్‌పల్లి - మాండ్ర రోడ్డుకు మహర్దశ పట్టనుంది. ఇదే మండలానికి చెందిన రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆ గ్రామ ప్రజలకు ఊహించని ఆనందాన్ని ఇచ్చాడు. నల్లగొండ జిల్లాలో సీఎం పర్యటన కొనసాగుతుండగానే జీవోలు ఇప్పించి అప్పటికప్పుడే యుద్ధ ప్రాతిపదికన డిజిటల్ శిలాఫలకాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో ఆవిష్కరింపజేశారు. నాలుగేళ్లుగా రోడ్డు మరమ్మతుల కోసం ఎదురుచూస్తున్న గ్రామస్థులను డబుల్ ఆశ్చర్యానికి గురిచేశారు. నార్కట్‌పల్లి-మాండ్ర వరకు ఉన్న(5.5 కి.మీల) పంచాయతీరాజ్ రోడ్డును తను మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న రోడ్లు భవనాల శాఖకు మార్పించారు. రూ.14 కోట్ల నిధుల పెద్ద మొత్తంతో రోడ్డు విస్తరణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరింపజేశారు. ఊహించని విధంగా రోడ్డుకు నిధులు మంజూరు చేసిన మంత్రి కోమటిరెడ్డికి, ఎమ్మెల్యే వేముల వీరేశానికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో పారిశ్రామిక అభివృద్ధికి బాటలు వేస్తుందని గ్రామస్థులు భావిస్తున్నారు.

నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు

నార్కట్‌పల్లి-మాండ్ర పంచాయతీరాజ్ బీటీ రోడ్డు మరమ్మతుల కు బీఆర్ఎస్ పాలనలో రూ.82.50లక్షలు మంజూరయ్యాయి. ఆ పనులకు శంకుస్థాపన చేసినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. పనులు ప్రారంభించకపోవడానికి కారణాలను నవంబరు 22న 'బీటీ రోడ్డుకు మోక్షం కలిగేనా' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి టాబ్లాయిడ్‌లో కథనం ప్రచురితమైంది. ఓ వైపు సమస్య తీవ్రతను బాధిత గ్రామస్థుల ద్వారా ప్రస్తావిస్తూనే మరోవైపు సమస్య పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధులు చేసిన సూచనలు, అధికారులు సవరించిన ప్రతిపాదనలను తెలుపుతూ కథనంలో సోదారహరణంగా వివరించడం జరిగింది. ఈ కథనంలోని సారాంశాన్ని అధికార పార్టీ నేతలు ఎమ్మెల్యే వేముల వీరేశం, మంత్రి వెంకట్‌రెడ్డి దృష్టికి వివిధ మార్గాల ద్వారా చేరవేశారు. దీంతో ఆయన డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు చేశారు.



దెబ్బతిన్న మాండ్ర రోడ్డు (ఫైల్ ఫొటో)

ఔత్సాహిక పారిశ్రామక వేత్తల ఆసక్తి

రోడ్డు విస్తరణ జరిగితే మాండ్రకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. మాండ్ర - కక్కిరేణిలో మధ్యలో ఇప్పటికే 600 ఎకరాల్లో ఏర్పాటు చేసిన సోలార్ పవర్ ప్లాంట్‌లో వందల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అదే విధంగా అనంత స్వర్ణగిరిపై సుమారు రూ.6కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయం, మహాలక్ష్మి ఆలయాలు నిర్మాణమయ్యాయి. అయితే బీఆర్ఎస్ హయాంలో కొందరు మన రాష్ట్రానికే చెందిన ప్రవాస భారతీయులు ఈ ప్రదేశాన్ని సందర్శించి ప్రకృతి చికిత్సాలయం, సెంటు తయారు చేసే పరిశ్రమలను నెలకొల్పేందుకు పరిశీలించారని సమాచారం. రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో ఆసక్తి చూపలేదని తెలిసింది. ఒకవేళ డబుల్ బీటీ రోడ్డు వేస్తే కొత్తగా పరిశ్రమలు వచ్చే అవకాశం లేకపోలేదు.

నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు



నార్కట్‌పల్లి-మాండ్ర రోడ్డు విస్తరణ పనులకు రూ.14 కోట్లు నిధులు మంజూరు చేసినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశంకు కృతజ్ఞతలు. దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతుల కోసం సంవత్సరాల తరబడి ఎవరికి చెప్పినా పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో శిలాఫలకంతోనే సరిపెట్టారు. గుంతలు పూడ్చితే చాలనుకున్నాం. కానీ రోడ్డును విస్తరించే ప్రకటన గ్రామస్థులకు ఎంతో ఆనందంగా ఉంది.

● దొండ రమేష్, మాండ్ర

నెలాఖరులోగా టెండర్ ప్రక్రియ పూర్తి



నార్కట్‌పల్లి - మాండ్ర పీఆర్ రోడ్డును ఇటీవలే ప్రభుత్వం రోడ్లు భవనాల శాఖకు బదిలీ చేసింది. రోడ్డు విస్తరణకు రూ.14 కోట్లు మంజూరు కాగా పరిపాలనా ఆమోదం లభించింది. ఇప్పుడున్న రోడ్డును 7 మీటర్ల వెడల్పుతో బీటీగా ఇరువైపులా, 1 మీటరు వెడల్పు చొప్పున గ్రావెల్ (మట్టి)తో చేపడుతాం. వారంలో డీటైల్డ్ అంచనా ప్రతిపాదనలు తయారు చేసి ఈనెలాఖరులోగా టెండరు ప్రక్రియను పూర్తిచేస్తాం.

● సుధాకర్‌రెడ్డి, డీఈఈ ఆర్‌అండ్‌బీ

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

శాలిగౌరారం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం ఉట్కూరు గ్రామానికి చెందిన వేముల అంజయ్యకు ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరైంది. ఈ చెక్కును కాంగ్రెస్ నాయకులు కుర్ర లింగయ్య, వేముల ఇద్దయ్య లబ్ధిదారునికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రావుల లింగయ్య, వేముల గోపినాథ్, మెట్టు శ్రీనివాస్, బొడ్డు సోమయ్య, నిదుర వీరయ్య, లింగయ్య పాల్గొన్నారు.

జగదీష్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నేతలు

నార్కట్‌పల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీష్ రెడ్డిని నార్కట్‌పల్లి బీఆర్ఎస్ మండల నాయకులు ఆదివారం నల్లగొండలో మర్యాదపూర్వకంగా కలిశారు. జగదీష్‌రెడ్డిని కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్ రెడ్డి, మేకల రాజిరెడ్డి, కమ్మంపాటి వెంకటయ్య, మారుపాకల ప్రభాకర్‌రెడ్డి, గాదరి రాంబాబు, యేళ్ల వెంకట్‌రెడ్డి ఉన్నారు.

గణేష్‌ను అభినందించిన ఎంపీ

శాలిగౌరారం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన బొల్లికొండ గణేష్‌ను ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు.

నిర్వహణలేక.. నిరుపయోగంగా

● దేవరకొండ పట్టణంలో పార్కులు, ఓపెన్ జిమ్‌లు, ప్రకృతివనాల పట్టింపు కరువు ● నిరుపయోగంగా క్రీడాసామాగ్రి


ముత్యాలమ్మబజార్‌లో నిరుపయోగంగా పార్కులో ధ్వంసమైన చిన్నపిల్లల క్రీడాసామాగ్రి

దేవరకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం మినీ పార్కులు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. దేవరకొండ మున్సిపాలిటీలో 2020-22లో గత ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయలతో పట్టణంలో పార్కులు, ఓపెన్‌జిమ్‌లు, ప్రకృతివనాలు, ఏర్పాటు చేశారు. నిర్వహణ లేకపోవడంతో ఓపెన్‌జిమ్, పార్కుల్లో క్రీడాసామాగ్రి నిరుపయోగంగా ఉన్నాయి. పట్టణంలోని సంజయ్ కాలనీలో రూ.10లక్షల వ్యయంతో, బంజారభవన్ వద్ద ఓపెన్ జిమ్, పార్కుకు రూ.10లక్షలు, ముత్యాలమ్మ బజార్‌లో పిల్లల పార్కుకు రూ.15లక్షలతో నిర్మించారు. పార్కులు, ఓపెన్‌జిమ్‌లలో వాకింగ్‌ట్రాక్, చిన్న పిల్లల కోసం ఆట సామాగ్రి, అందమైన పూల మొక్కలు, మొక్కలకు నీరు అందించేందుకు డ్రిప్ విధానం ఏర్పాటు చేశారు. కాని అధికారులు పట్టించుకోకపోవడంతో పార్కుల్లో ఏర్పాటు చేసిన ఆటల సామాగ్రి ధ్వంసానికి గురయ్యాయి. పూల మొక్కలకు నీరు అందించకపోవడంతో ఎండిపోయాయి. దేవ రకొండ ఖిల్లాలో ఐదు ఎకరాల్లో రూ.5కోట్లతో నిర్మించిన పార్కు ప్రారంభానికి సిద్ధం ఉంది. ఖిల్లాలో ఏర్పాటు చేసిన పార్కు నిర్వాహకులు మొక్కలకు నీరు అందిస్తు సౌకర్యాలు కల్పించడంతో స్థానికులు, పర్యాటకులు దేవరకొండ ఖిల్లాలోని పార్కుకు చేరుకొని ఉల్లాసంగా గడుపుతున్నారు. కాని పట్టణంలో సంజయ్‌కాలనీ, బంజారభవన్, ముత్యాలమ్మ బజార్‌లో ఏర్పాటు చేసిన మినీ పార్కుల నిర్వాహణ లేకపోవడం, అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. బంజారభవన్ పక్కన ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్, పార్కు గేటుకు ఎప్పుడూ తాళం వేసి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. లక్షల రూపాయలు కేటాయించి పార్కులు నిర్మించినా నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్‌తోపాటు ఉన్నత అధికారులు స్పందించి పార్కుల నిర్వాహణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పార్కులు ప్రారంభించి వదిలేశారు

పట్టణంలోని ముత్యాలమ్మబజార్‌లో మినీపార్కును ప్రారంభించి వదిలేశారు. నిర్వాహణలేకపోవడంతో క్రీడా సామాగ్రి ధ్వంసానికి గురైంది. మొక్కలకు నీరు పోసేవారులేరు. అధికారులు స్పందించి పార్కు నిర్వాహణ బాధ్యతలు చేపట్టి ఉపయోగంలోకి తీసుకురావాలి.

● నేతాళ్ల వెంకటేష్‌యాదవ్, ముత్యాలమ్మ బజార్, దేవరకొండ.

పార్కులలో సౌకర్యాలు కల్పిస్తాం

దేవరకొండ పట్టణంలో నాలుగు పార్కులను ఏర్పాటు చేశాం. ప్రస్తుతం నిర్వాహణ మున్సిపల్ సిబ్బందే చూస్తున్నారు. తనిఖీలు చేపడుతాం. పార్కుల్లో కాలనీవాసులకు సౌకర్యాలు ఏర్పాటు చేశాం. నిర్వహణ చేపట్టి పట్టణవాసులకు ఆహ్లాదం పంచుతాం.

● దేవరకొండ మున్సిపల్ ఏఈ రాజు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పారిశుధ్య సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

సుదర్శన్, కమిషనర్, దేవరకొండ



దేవరకొండ మునిసిపాలిటీలో పరిశుభ్రత, పచ్చదనానికి అధిక ప్రాధాన్యతనిస్తూనే ప్లాస్టిక్ నిషేధ అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ సుదర్శన్ తెలిపారు. పట్టణ అభివృద్ధికి సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణంలో చేపట్టే పనుల గురించి ఆదివారం ఆయన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

- (దేవరకొండ, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

కమిషనర్: దేవరకొండ పట్టణంలోని 20 వార్డులకు ప్రస్తుతం మిషన్‌భగీరథ ద్వారా సరిపడా తాగునీరు అందిస్తున్నాం. ప్రస్తుతం పట్టణంలో నీటి సమస్య లేదు.

ఆంధ్రజ్యోతి: పట్టణంలో అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

కమిషనర్: దేవరకొండ పట్టణంలో నూతనంగా ఇళ్లు నిర్మించుకుంటున్న వారు మున్సిపల్ అనుమతి తీసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణం చేపడితే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: పట్టణంలో పారిశుధ్య సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

కమిషనర్: దేవరకొండ పట్టణంలో పారిశుధ్య సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు చేపడుతున్నాం. తడి చెత్త, పొడిచెత్త వేరుచేసి ఇవ్వాలని సూచనలు చేశాం. ఇంటింటికీ రెండు చెత్తబుట్టలు అందజేశాం. పరిశుభ్రత, పచ్చదనానికి అధిక ప్రాధాన్య ఇస్తూనే ప్లాస్టిక్ నిషేధ అమలుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: పట్టణంలో రోడ్ల మరమ్మతులు ఎప్పుడు చేపడతారు?

కమిషనర్: పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మిషన్‌భగీరథ పైప్‌లైన్‌ల కోసం రోడ్లను తవ్వారు. రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.30లక్షలు మంజూరు చేసింది. త్వరలో ఎమ్మెల్యే బాలునాయక్ సహకారంతో పనులు ప్రారంభిస్తాం.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తారని ఎఫ్‌పీటీ ఇండియా లిమిటెడ్ ప్రతినిధి రఘురామ్ అన్నారు. గుడిపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సామాజిక బాధ్యతలో భాగంగా నీటి శుద్ధి కూలర్, విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ దేవకి రవికుమార్, ఎంఈవో సముద్రాల శ్రీనయ్య, ఉపాధ్యాయులు వెంకటయ్య, వై. శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్

మిర్యాలగూడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అల్లం కిరణ్ వర్ధంతి సందర్భంగా 8,9,10వ తరగతుల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్, ఎస్సే రైటింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన 300మంది విద్యార్థులు పాల్గొన్నట్లు అల్లం కిరణ్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కేతనపల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. టెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు డిసెంబరు 13న నిర్వహించే అల్లం కిరణ్ వర్ధంతి సభలో బహుమతులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు కందుకూరి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

కొండమల్లేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని సీతారామచంద్రమౌళీశ్వర అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణానికి చెందిన సముద్రాల స్వప్న, మధు దంపతుల సహకారంతో అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి చిట్టిడి ప్రభాకర్‌రెడ్డి, గుమ్మడవెల్లి జనార్దన్, మహేష్, బోడ నగేష్, అయ్యప్ప మాలాదారులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గుర్రంపోడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆములూరు వాగునుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు తనిఖీలు చేస్తుండగా చేపూరు ఎక్స్‌రోడ్డు వద్ద ఇసుకతో వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని డ్రైవర్‌ను విచారించగా ఆములూరు వాగు నుంచి తానేదారుపల్లి గ్రామానికి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నట్లు డ్రైవర్ శంకర్ తెలిపారు. ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అయ్యప్ప మహాపడి పూజ

చింతపల్లి, (ఆంధ్రజ్యోతి): మాల్‌కు చెందిన ప్రవీణ్ స్వామి గృహంలో ఆదివారం ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా 18 మెట్లపై ప్రత్యేక పూజలు జరిపారు. దీంతో ప్రాంగణం ఒక్కసారిగి అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మట్ట యాదయ్య, వైద్యుల ప్రవీణ్‌శర్మ, కిరణ్‌చారి, నవీన్, కాసోజు ప్రేమానందాచారి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా, డిసెంబరు 8: ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని బీఆర్ఎస్ సాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నోముల భగత్ విమర్శించారు. హాలియాలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు భరోసా, పింఛన్ల పెంపు, మహాలక్ష్మి పథకం (రూ.2,500), కల్యాణలక్ష్మి ద్వారా తులం బంగారం లాంటి పథకాలను ఇంకా అమలు చేయలేదన్నారు. దళితబంధు, బీసీ బంధు, రైతుబీమా ప్రస్తావనే లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏడాదిలోనే ఎమ్మెల్యేగా తాను రూ.150కోట్లు తీసుకొచ్చి నియోజకవర్గంలో రోడ్లు, భవనాలు, వంతెనలు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం తదితర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేశానన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి చేసిన అభివృద్ధిపై చర్చ పెట్టాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, తాటి సత్యపాల్, జటావత్ రవినాయక్, తిరుపతిరావు, వడ్డే సతీష్‌రెడ్డి, కౌన్సిలర్ నల్లగొండ సుధాకర్, జవ్వాజి వెంకటేశ్వర్లు, కామెర్ల జానయ్య, ఏడుకొండలు, వెంకట్‌రెడ్డి, వెంకటాచారి, చాపల సైదులు, రావుల లింగయ్య, సురభి రాంబాబు, ఆవుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

డిండి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులంతా ఒక్కచోట చేరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాతజ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు అడపాల జంగారెడ్డి, వద్ది జంగారెడ్డి, వంగాల శేఖర్‌రెడ్డి, వీవీ ప్రసాద్, మహమ్మద్ అజీమొద్దిన్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మూడావత్ రవిచౌహాన్, షేక్ కాశీం, ఖదీర్, ఎండపల్లి లక్ష్మయ్య, గోపాల్, మల్లిఖార్జున్, రమేష్, రఘువీర్, వెంకటేష్, రేణయ్య, ఇస్తారయ్య, జంగమ్మ, ప్రభావతి, భద్రావతి, మాలన్, రజిత, విజయలక్ష్మి పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


చింతపల్లిలో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చింతపల్లి మండలకేంద్రానికి చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముచ్చర్ల యాదగిరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్‌యాదవ్, శ్రీనునాయక్, రంగయ్య పాల్గొన్నారు.

దేవరకొండ, (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉండి దరఖాస్తులు చేసుకున్నవారందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహాయనిధి అందజేసి ఆదుకుంటున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. ఆదివారం దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వందమంది లబ్ధిదారులకు మంజూరైన రూ.52లక్షల సీఎం సహాయనిధి చెక్కులు అందజేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైద్య, ఆరోగ్యం, విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, పున్న వెంకటేశ్వర్లు, హనుమంతు వెంకటేష్‌గౌడ్, దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, బిక్కునాయక్, హరికృష్ణ, రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి


గిరిజన సంక్షేమ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దామరచర్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యాభివృద్ధి కోసం ఏకలవ్య, ఆదర్శ గురుకుల పాఠశాలతోపాటు, గిరిజన తండాల అభివృద్ధికి ట్రైకార్ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించాలని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరధ్‌నాయక్ అన్నారు. ఆదివారం కేంద్ర ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాలల ఏర్పాటు కమిటీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ ప్రిన్సిపల్ సెక్రటరీ అడావత్ శరత్‌నాయక్‌ను కొండ్రపోల్‌లో దశరధ్‌నాయక్ కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజన జనాభా అత్యధికం గల నియోజకవర్గాల్లో గిరిజన అక్షరాస్యత పెంపుదలకు ఆదర్శ ఏకలవ్య పాఠశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. మూరమూలతండాల్లో కనీస సౌకర్యాలు కల్పించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మక్లా, జైత్రాంనాయక్, ధీరావత్ మోహన్‌నాయక్, సైదానాయక్, జామ్లనాయక్, రవినాయక్, శశిధర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం

దేవరకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండలో పీఏపల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ అర్వపల్లి సరిత నర్సింహ, మార్కెట్ మాజీ డైరెక్టర్ యాదగిరితోపాటు 60 మంది కాంగ్రెస్ నుంచి ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలో కూరుకుపోయిందని, ఏమి సాధించారని ప్రజాపాలన సంబరాలు జరుపుకుంటున్నారన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ సత్తా చాటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వల్లపురెడ్డి, నాయకులు మునగాల అంజిరెడ్డి, ముత్యపురావు, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ కండువాలు కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

కరాటేతో శారీరక ధృడత్వం


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కరాటే సాధనతో శారీరక ధృడత్వం కలుగుతుందని లిటిల్ ఫ్లవర్ పాఠశాల ప్రిన్సిపాల్ కేకే. జయరాజన్ అన్నారు. సుమన్ ఇండియా బూడోఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబర్చి బెల్టులు సాధించిన విద్యార్థులను ఆదివారం అభినందించారు. ఆటలపై ఆసక్తి చూపే విద్యార్థులు చదువులోనూ రాణిస్తారన్నారు. కరాటే, జూడో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతాయన్నారు. అకాడమీ వ్యవస్థాపకులు బూడిద సైదులు మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ బానావత్ రామకృష్ణనాయక్, హెచ్‌ఎం సుజయ్‌కుమార్, పీఈటీ నీలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శంకర్‌పై చర్యలు తీసుకోవాలి

డిండి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వెలమ కులస్తుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని వెలమ సంఘం దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు మాధవరం శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం దేవరకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివాదస్పద వ్యాఖ్యలు ఉపసంహరించుకోవడంకాదు వెలమలకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింహరావు, వెంగల్‌రావు, గోవర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వివరాలు అందించాలి

చింతపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 12న సీఎం కప్(2024) మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుజాత తెలిపారు. ఈ పోటీల్లో ఎనిమిది జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను గుర్తించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ వివరాలను ఈ నెల 10వ తేదీ వరకు హెచ్‌ఎంలకు అందజేయాలని కోరారు.

తీన్మార్ మల్లన్నను ఆహ్వానించకపోవడం సరికాదు

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను ఆహ్వానించకపోవడం సరికాదని బీసీ విద్యార్థి సంఘ జిల్లా అధ్యక్షుడు గాదగోని మహేష్‌గౌడ్ అన్నారు. ఆది వారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బీసీ ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల పట్ల అగ్రవర్ణాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా రన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రాజు, కృష్ణ, శ్రీనివాస్, అశోకాచారి, రవీందర్ ఉన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్‌గా కేశవరెడ్డి



నిడమనూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగులగడ్డ గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి దేవాలయం చైర్మన్‌గా చామల కేశవరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు విడుదల చేశారు. దీంతో చైర్మన్‌గా కేశవరెడ్డి, డైరెక్టర్లుగా బొల్లెంపల్లి కళమ్మ, పెల్లి సైదమ్మ, చామల రాంరెడ్డి, మల్లికంటి అంజయ్యల చేత ఆదివారం ఎండోమెంటు మిర్యాలగూడ ఇన్స్‌పెక్టర్ వెంకటలక్ష్మి ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ దేవాలయం అభివృద్ధికి నూతన పాలకవర్గం కృషి చేస్తుందని తెలిపారు. పలువురు నూతన పాలకవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఈవో సిరికొండ నవీన్, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, యడవెల్లి రంగశాయిరెడ్డి. నందికొండ రామేశ్వరిమట్టారెడ్డి, ముంగి శివమూరయ్య, కొండా శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగు విజయ్‌కుమార్, సోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, చామల ప్రభాకర్‌రెడ్డి, జాలా పాపయ్య, మాతంగి ఇద్దయ్య తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రామడుగు సబ్‌స్టేషన్ పరిధిలోని రామడుగు, కుపాస్‌పల్లి 11 కేవీ. ఫీడర్లకు ఈనెల 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు హాలియా విద్యుత్ ఏఈ దన్‌రాజ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఫీటర్ల పై నుంచి 400 కేవీ లైన్ పనులు చేస్తుండడంతో ఆరు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి



కొండమల్లేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మాజీ ఎంపీపీ దూదిపా రేఖశ్రీధర్‌రెడ్డి కోరారు. కొండమల్లేపల్లి మండల పరిధిలోని కేజీబీవీ, బీసీ బాలుర గురుకుల, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆదివారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆమె వెంట మంగ్యనాయక్ తదితరులు ఉన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

హాలియా, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పల్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ శ్యామ్‌పాల్‌రెడ్డి, శాంతి కోరారు. అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రతి వారం రిపోర్ట్ గ్రూప్‌లో పంచాలని సూచించారు. సెంటర్లు నడుస్తున్న తీరు, విద్యార్థుల చదువుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ పల్‌రెడ్డి నర్సింహారెడ్డి, వివిధ మండలాల కోఆర్డినేటర్లు అంజి, రిజ్వాన్, సునీత, రమేష్‌రెడ్డి, నర్సింహ, శేఖర్, పాల్గొన్నారు.

బాధితుడికి మాజీ ఎమ్మెల్యే భగత్

పెద్దవూర, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ గోనె వివేక్‌రావు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆదివారం వివేక్‌రావు నివాసానికి వెళ్లి పరామర్శించి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోనె విష్ణువర్ధన్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు జటావత్ రవినాయక్, యూత్ అధ్యక్షుడు మెండె సైదులు, మాజీ సర్పంచ్ రావుల శ్రీనివాస్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవినాయక్, నాయకులు సురభి రాంబాబు, పామోజు వెంకటాచారి, తుడుం రాకేష్, నాగేశ్వర్‌రావు, బాణాల పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరణ

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుడిపల్లి మండలం మాజీ వైస్ ఎంపీపీ ఆర్వపల్లి సరితనర్సింహ, మార్కెట్ మాజీ డైరెక్టర్ ఎర్ర యాదగిరిని పార్టీ నుంచి బహిష్కరించినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్యయాదవ్ ఆదివారం ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీకి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, అంతర్గతంగా గతంలో పనిచేసిన బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరించిన విధానాన్ని పరిగణలోకి తీసుకోని ఇరువురిని కాంగ్రెస్ పార్టీ నుంచి శాశ్వతంగా బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. నేటి నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి వారికి ఎలాంటి సంబంధం లేదని వారు తెలిపారు.

ఉద్యమకారులను గుర్తించాలి

గుర్రంపోడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యమకారులకు పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వాలని మలిదశ ఉద్యమకారుడు, సింగిల్‌విండో డైరెక్టర్ వడ్త్య నాగరాజు డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఒంటెద్దు పోరాటాలతో పార్టీకి తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. మండలంలో ఎవరూ గుర్తించని వ్యక్తిని పార్టీ అధ్యక్షుడిగా నియామక పత్రం అందజేయడం సరికాదన్నారు. పార్టీలో సీనియర్ నాయకులకు గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధిష్టానం ఈ విషయాన్ని గుర్తించి ఉద్యమకారులకు అధ్యక్ష పదవిని ఇవ్వాలని డిమాండ్ చేశారు.